REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com




జీవించేందుకే మనిషి తినాలి
సమాజ సంక్షేమానికి జీవించాలి
- డాక్టర్ బిఆర్ అంబేద్కర్


**పాఠకులకు విజ్ఞప్తి**


జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ :
janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 7013030690



సంపుటి : 4 | సంచిక : 320 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 03-06-2025 | పేజీలు : 7


# కొల్లేరు ప్రజల సమస్యకు మానవీయ కోణంలో పరిష్కారం

- పర్యావరణాన్ని కాపాడుకుంటూనే స్థానికులకు న్యాయం
- జిరాయితీ, డి-పట్టా భూములపై హక్కులు కాపాడే ప్రయత్నం
- ఉప్పుటేరు డ్రయిన్‌కు అడ్డంకుల తొలగింపునకు తక్షణ చర్యలు
- కొల్లేరులో సమస్యలపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 5న కోటి మొక్కల ప్లాంటేషన్
- మంత్రులు, కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలన్న సీఎం



**అమరావతి, జూన్ 2 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** పర్యావరణపరంగా కీలకమైన కొల్లేరు సరస్సును పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఇదే సమయంలో ఆ ప్రాంతంలో ఉన్న ప్రజల సమస్యలను మానవీయ కోణంలో చూసి పరిష్కరించాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. కొల్లేరుపై కోర్టు తీర్పులు, నిబంధనలు, కేంద్ర సంస్థల ఆదేశాలు, స్థానిక పరిస్థితులు, పర్యావరణ, కాంటూరు అంశాలపై సీఎం చంద్రబాబు సచివాలయంలో సోమవారం సమీక్షించారు. కొల్లేరు పరిధిలో మూడు లక్షల మంది ప్రజలు ఉన్నారు... కొల్లేరు కాంటూరు పరిధి అంశంలో చాలా కాలంగా వీరు సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీరి సమస్య పరిష్కారం కోసం 2014 నుంచి 2019 మధ్య నాటి తెలుగుదేశం ప్రభుత్వం చాలా ప్రయత్నాలు చేసింది. ఇందులో భాగంగా 2018లో నేషనల్ వైల్డ్ లైఫ్ బోర్డు 20 వేల ఎకరాల జరాయితీ, డీ పట్టా భూములను కొల్లేరు పరిధి నుంచి మినహాయించి కొత్త సరిహద్దులను నిర్ధారించాలని చెప్పింది. ఈ మేరకు సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి సిఫారసు కూడా చేసింది. అయితే దీనిపై కొందరు అభ్యంతరాలు చెప్పడంతో రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. కొల్లేరు సమస్య పరిష్కారంపై పట్టుదలగా ఉన్న కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఆ ప్రాంతం ఎమ్మెల్యేలతో సమీక్ష చేశారు.

**కాలుష్య ప్రక్రియకు అడ్డుకట్ట పడాలి :**

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ...'కొల్లేరు కాలుష్య కాసారం కాకుండా చూడాలి. కొల్లేరులోకి వెళ్తున్న డ్రైన్ వాటర్‌కు ట్రీట్మెంట్ జరగాలి. విచ్చల విడిగా డ్రైన్లు వదిలేసి కొల్లేరును కాలుష్యమయం చేసే ప్రక్రియకు బ్రేక్ పడాలి. డ్రైన్‌లో పూడికలు తొలగించాలి....నీరు సులువుగా వెళ్లే అవకాశం కల్పించాలి. కొల్లేరు నుంచి నీటిని సముద్రంలోకి తీసుకువెళ్లే ఉప్పుటేరు అక్రమణలను తొలగించాలి. ఉప్పుటేరు పూడిక తీసి, ఆక్రమణలు తొలగించి నీరు సముద్రంలోకి వెళ్లేలా చేయాలి. అవుట్ లెట్లు పూర్తిగా క్లియర్ చేయాలి. ఈ పనులకు అవసరమైన అంచనాలు రూపొందించి పనులు ప్రారంభించాలి" అని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కొల్లేరు రైతుల సమస్యలపై మాట్లాడుతూ.... "కొల్లేరు పరిధిలో 20 వేల ఎకరాల జిరాయితీ, డీ పట్టా భూములు ఉన్నాయి. కాంటూరు సమస్య నేపథ్యంలో ముందుగా వీరికి న్యాయం జరిగేలా చూడాలి. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను సీఈసీని, సుప్రీంకోర్టు ముందు ఉంచి వారిని ఒప్పించాలి. పక్షులు, పర్యావరణంతో పాటు ప్రజలకు కూడా న్యాయం జరిగేలా కార్యాచరణ ప్రారంభించాలి" అని సీఎం చంద్రబాబు అన్నారు. సమీక్షకు చీఫ్ సెక్రటరీ విజయానంద్‌తో పాటు అధికారులు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, ధర్మరాజు, చింతమనేని ప్రభాకర్ హాజరయ్యారు.

**5న కోటి మొక్కల ప్లాంటేషన్ :**

రాష్ట్రంలో పచ్చదనాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. ఈ మేరకు సచివాలయంలో సీఎం చంద్రబాబు ఈ అంశంపై సమీక్షించారు. ఈ నెల 5న కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఇందులో కలెక్టర్లు, మంత్రులు, ప్రజాప్రతినిధులందరూ భాగస్వాములవ్వాలని కావాలని, విద్యాసంస్థలు, వైద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్ స్టేషన్లు, రహదారులకు ఇరువైపులా ట్రీ గార్డులతో ప్లాంటేషన్ చేయాలన్నారు. రాష్ట్రంలో ఇది గతేడాది 29 శాతం వరకు గ్రీన్ కవర్ ఉందని, ఈ ఏడాదికి 30.5 శాతానికి పెరిగిందని సీఎం అన్నారు. ఉద్యానవనాల సాగు, అటవీ ప్రాంతంతో సహా రాష్ట్రంలో పచ్చదనం 2033 నాటికి 37 శాతానికి, 2047కి 50 శాతానికి చేరుకునేలా కార్యాచరణ ఉండాలన్నారు. ప్రతి ఏడాది కనీసం 1.5 శాతం మేర గ్రీన్ కవర్ పెరగాలన్నారు. సీఆర్డీఏ పరిధిలో ఫారెస్ట్‌తో కలిపి ఎంత గ్రీన్ కవర్ ఉందో స్పష్టమైన సమాచారం శాటిలైట్ల సాయంతో సేకరించాలని, అలాగే ప్రతీ ప్లాంట్‌ను ట్యాగ్ చేయాలన్నారు. రాష్ట్రం ఆహ్లాదకరంగా పచ్చదనంతో ఉండాలని, మొక్కలు నాటి వదిలేయడం కాకుండా వాటిని పరిరక్షించే చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో పచ్చదనం పెంచేందుకు అవసరమైతే సామాజిక బాధ్యత కింద కార్పొరేట్ సంస్థలు ముందుకువస్తే వారికి అవకాశం కల్పించే విధానం తీసుకురావాలని సూచించారు. అమరావతి పరిధిలోని అన్ని రిజర్వ్ అటవీ ప్రాంతాలను మియావకీ తరహాలో పచ్చదనం పెంచి, 3 ఏళ్లలో ఫలితాలు కనబడాలన్నారు.

## సత్యనారాయణపురంలో నూతన మోడల్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన హోంమంత్రి వంగలపూడి అనిత



**విజయవాడ, జూన్ 3 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** నగరంలోని ముత్యాలంపాడు స్ట్రీట్, జి.ఎస్.రాజు రోడ్ వద్ద అత్యాధునిక సౌకర్యాలతో నిర్మితమైన సత్యనారాయణపురం మోడల్ పోలీసు స్టేషన్‌ను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ భవనం రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మితమైంది. ఈ మోడల్ స్టేషన్‌లో సెంట్రీ, రిసెప్షన్, మహిళా హెల్ప్ డెస్క్, అధికారుల ప్రత్యేక గదులు, సి.డి.ఆర్. అనాలసిస్, సైబర్ క్రైమ్ విభాగం, సి.సి.టి.ఎన్.ఎస్., ఎల్.హెచ్.ఎం.ఎస్, ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలు వంటి ఆధునిక విభాగాలు ఏర్పాటు చేయడం జరిగింది. పోలీసు సిబ్బందికోసం జిమ్, ఫిర్యాదుదారుల పిల్లల కోసం ప్రత్యేకంగా ప్లే రూమ్ కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర డి.జి.పి. హరీష్ కుమార్ గుప్తా, నగర పోలీసు కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు, ఎన్.టి.ఆర్ జిల్లా ఎంపీ కేశినేని శివనాద్ (చిన్ని), ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు, డీసీపీలు కె.జి.వి. సరిత, తిరుమలేశ్వర రెడ్డి, ఎ.బి.టి.ఎస్. ఉదయారాణి, పోలీసు అధికారులు కృష్ణమూర్తి నాయుడు, ఎస్.వి.డి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, "సత్యనారాయణపురంలో మోడల్ పోలీస్ స్టేషన్ ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉంది. ఏపీ పోలీసులు టెక్నాలజీ వినియోగంలో ముందున్నారు. టెక్నాలజీ సహాయంతో నేరాల నివారణలో మేము ముందుంటున్నాం. ఇకపై రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేట్ స్థాయిలో మోడల్ పోలీస్ స్టేషన్లను నిర్మించనున్నాం. హాట్ స్పాట్ ప్రాంతాల్లో పటిష్ట భద్రత అవసరం. డ్రోన్, సీసీ కెమెరాల ద్వారా ఎన్.టి.ఆర్. జిల్లా పర్యవేక్షణలో ఉంది. పోలీస్ స్టేషన్లలో జిమ్, యోగా రూమ్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేయడం అభినందనీయం. నేరస్తులకు భయం కలిగేలా ఏపీ పోలీసులు పని చేస్తున్నారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లపై విజయవాడలో పోలీసుల చర్యలు అభినందనీయం. 24 గంటల్లో నిందితులను పట్టుకోవడం ఇన్విజిబుల్ పోలీసింగ్‌కు నిదర్శనం" అని పేర్కొన్నారు. నగర పోలీసు కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు మాట్లాడుతూ, "ఈ స్టేషన్ ప్రారంభోత్సవానికి హాజరైన హోంమంత్రి గారికి, డి.జి.పి. గారికి, మంత్రులకు, అధికారులకు కృతజ్ఞతలు. ప్రభుత్వ సూచనల మేరకు మేము మోడల్ పోలీస్ స్టేషన్‌లను అభివృద్ధి చేస్తున్నాం. నేరాల నివారణకు, నేరం జరిగిన వెంటనే చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. సురక్షా కమిటీలు, సీసీ కెమెరాలు, ఈ-పహారా, సైబర్ సిటిజన్స్, అస్త్రం, విక్టిం కంపెన్సేషన్, క్లౌడ్ పెట్రోల్స్, ట్రాఫిక్ అంబాసిడర్లు, ఫాల్కన్, చెరువా వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు సేవలందిస్తున్నాం. ఎన్నో ధాతృ సంస్థలు పోలీసు శాఖకు సహకరిస్తున్నాయి. వారికి మా కృతజ్ఞతలు" అని తెలిపారు. ఈ పోలీసు స్టేషన్ ప్రారంభంతో నగరంలోని శాంతిభద్రతలు మరింతగా పటిష్టమయ్యే అవకాశముందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# సన్న బియ్యంతో మధ్యాహ్నం భోజనం పథకం

**అమరావతి, జూన్ 2 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** 'పాఠశాల విద్యార్థులకు రుచికరమైన, పౌష్టికాహార భోజనం అందించేందుకు సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింద'ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. జూన్ 12వ తేదీ నుంచి రాష్ట్రంలోని 41 వేల ప్రభుత్వ పాఠశాలలు, 4 వేల సంక్షేమ హాస్టల్స్ కు మూడున్నర లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం సరఫరా చేస్తామని చెప్పారు. ఏ రైతు అయితే ఈ బియ్యం పండించారో... ఆయన చేతుల మీదుగానే పాఠశాలు, సంక్షేమ హాస్టల్స్ కు బియ్యం పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తద్వారా రైతులకి గౌరవం కల్పిస్తామన్నారు. దేశానికి వెన్నెముక రైతు అని, రైతు లేనిదే రాష్ట్రం లేదని, అటువంటి రైతాంగానికి అండగా నిలబడటం ప్రభుత్వంగా తమ బాధ్యతని తెలిపారు. మూడు పార్టీల కలయికతో బలంగా ఉన్న మార్కెట్ యార్డ్ కమిటీని ఏర్పాటుచేయడం జరిగిందని, భవిష్యత్తులో వీరంతా కలసి, యార్డును మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. అవనిగడ్డ నియోజకవర్గం ఘంటసాల మండలం కొడాలి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా తోట కనకదుర్గ రాజశేఖర్, వైస్ ఛైర్మన్‌గా అత్తలూరి గోపిచంద్, డైరెక్టర్ల ప్రమాణస్వీకార కార్యక్రమం సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో ఘనంగా జరిగింది. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ గౌరవ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ "అకాల వర్షాలు, వరస ప్రకృతి విపత్తులతో ఈ ప్రాంత రైతాంగం ఎంతలా నష్టపోయిందో కళ్లారా చూశాం. రోడ్లపై ధాన్యాన్ని రాశులుగా పోసి కన్నీరు కార్చిన సందర్భాలు కోకొల్లలు. అన్నదాతల్లో ధైర్యం నింపడానికి ఆ రోజు పవన్ కళ్యాణ్ ఈ ప్రాంతాల్లో పర్యటించారు. తక్షణ నష్టపరిహారం రైతులకు చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరినా వైసీపీ నాయకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. వైసీపీ ప్రభుత్వం రైతులను ఎంతలా వేధించింది అంటే.. వారికి అనుకూలమైన మిల్లులకే ధాన్యం అమ్మాలని రైతులపై ఒత్తిడి తీసుకొచ్చారు. వందల కిలో మీటర్లు దూరంలో ఉన్నా అక్కడికే వెళ్లి ఇవ్వాలని ఇబ్బంది పెట్టేవారు. రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి నెలలు, సంవత్సరాల తరబడి డబ్బులు చెల్లించేవారు కాదు.

**రూ.10 లక్షల కోట్ల అప్పులు :**

రాష్ట్ర అభివృద్ధిని గాలికొదిలేసి, కేవలం సంక్షేమం పేరిట గత ప్రభుత్వం విచ్చలవిడిగా అప్పులు చేసింది. దాదాపు రూ.10 లక్షల కోట్లు అప్పులు తీసుకొచ్చి రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టింది. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి రూ.1674 కోట్లు బకాయిలు పెట్టి వెళ్లిపోయారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రైతులకు అండగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్ణయం తీసుకోవడంతో కూటమి ప్రభుత్వం వచ్చిన నెల రోజుల్లోనే ధాన్యం బకాయిలు రైతులకు చెల్లించాం. భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్రం కొనుగోలు చేయని విధంగా ఖరీఫ్, రబీలో కలిపి దాదాపు 48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. దానికి సంబంధించి రూ. 12,400 కోట్లు 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ వేశాం. ఒక్క కృష్ణా జిల్లాలోనే దాదాపు 58 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. మిగిలిన ధాన్యాన్ని కోనసీమ, ఏలూరు నుంచి ఓపెన్ మార్కెట్ ద్వారా కొనుగోలుకు చర్యలు తీసుకున్నాం. రైస్ మిల్లులకు రూ.470 కోట్లు బకాయిలు పెడితే... కూటమి ప్రభుత్వం రూ. 360 కోట్లు చెల్లించి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వారిని భాగస్వాములు చేశాం. అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోతుందని రైతాంగం ఆందోళన చెందుతుంటే 5 కోట్ల 13 లక్షల గోతాలు ఇచ్చి రైతులను ఆదుకున్నాం. రైతులు ఏ మిల్లుకు అమ్ముకోవాలంటే ఆ మిల్లుకు అమ్ముకునేలా వెసులుబాటు కల్పించాం. వాట్సాప్ ద్వారా ధాన్యాన్ని అమ్ముకునేలా సాంకేతికను తీసుకొచ్చాం.

**రైతాంగం కోసం పల్లె పండగ లాంటి కార్యక్రమం :**

రైతులకు ఎక్కడా ఇబ్బంది కలగకూడదని రైతు సహాయక కేంద్రాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. వ్యవసాయ సిబ్బందిని క్షేత్ర స్థాయికి పంపించి భూసార పరీక్షలు నిర్వహిస్తున్నాం. వ్యవసాయాన్ని సాంకేతికతతో అనుసంధానం చేసి దిగుబడి పెంచుతున్నాం. కాలువలను ఆధునీకరిస్తున్నాం. ఈ ఏడాది ప్రకృతి కూడా సహకరించడంతో 34 బస్తాలు పండించే రైతులు 60 బస్తాలు పండించారు. గ్రామాల అభివృద్ధి కోసం పల్లెపండుగ వంటి కార్యక్రమం తీసుకొచ్చాం. అలాంటి కార్యక్రమమే రైతుల కోసం తీసుకొస్తాం.

**పారదర్శకత కోసమే ప్రజా పంపిణీ వ్యవస్థ :**

ఇంటింటికీ రేషన్ పేరిట వైసీపీ ప్రభుత్వం రూ.1650 కోట్లతో 9360 ఎం.డి.యూ. వాహనాలు కొనుగోలు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది. ఈ వాహనాల వల్ల వినియోగదారులకు ఎటువంటి ప్రయోజనం కలుగలేదు. ఎం.డి.యూ. వాహనాలు ఎప్పుడు ఎక్కడికి వస్తాయో ఎవరికీ సరైనా సమాచారం ఉండేది కాదు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో1.46 కోట్ల కుటుంబాలకు 29,761 రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీకి చర్యలు తీసుకున్నాం. ప్రతి నెలా 1 నుంచి 15 తేదీలోపు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ దుకాణాలు తెరిచే ఉంటాయి. ఆదివారాల్లోనూ సరుకులు పంపిణీ చేస్తాం. ఆ సమయంలో ఎప్పుడైనా లబ్ధిదారులు రేషన్ తీసుకునే వీలుంటుంది. గతంలో వలే వాహనం కోసం పనులు మానుకుని ఇళ్ల వద్దే ఉండాల్సిన అవసరం లేదు. వీలున్న సమయంలో రేషన్ దుకాణాల దగ్గరకు వెళ్లి సరకులు తెచ్చుకోవచ్చు. దివ్యాంగులకు, 65 ఏళ్లు నిండిన వృద్ధులకు ప్రతి నెలా 5వ తేదీలోపు సరుకులు ఇళ్ల వద్దే అందిచేలా చర్యలు తీసుకున్నాం.

**సుపరిపాలన మొదలై ఏడాది పోస్టర్ విడుదల :**

కూటమి విజయానికి ఏడాది పూర్తవుతున్న తరుణంలో ఈ నెల 4వ తేదీన జనసేన పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు నిర్వహిస్తున్నాం. సుపరిపాలనకు ఏడాది పేరుతో ఉదయం మహిళలు రంగవల్లులు వేసి కూటమి విజయాన్ని పండగలా చేసుకుంటారు. పేద విరగడై ఏడాది పేరుతో యువత సాయంత్రం దీపాలు వెలిగించి టపాకాయలు కాల్చి పండగ చేసుకుంటారు" అన్నారు. ఇందుకు సంబంధించిన సంబంధించిన పోస్టర్‌ను నాదెండ్ల మనోహర్ విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొణకళ్ల నారాయణ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, పార్టీ నాయకులు మండలి రాజేష్, గరికిపాటి శివశంకర్, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

**తేదీ : 03 జూన్ 2025,**
**తిథి : శుద్ధ అష్టమి (రా.10:01 వ.కు),**
**నక్షత్రం : పుబ్బ (04తా తె.01:01వ.కు),**
**బ్రహ్మ ముహూర్తం : తె.04:01ల తె.04:49,**
**రాహుకాలం : మ.03:19ల సా.04:56,**
**యమగండం : ఉ.08:52ల ఉ.10:28,**
**వర్జ్యకాలం : ఉ.07:34 ఉ.09:32**

## ఈ రోజు నమాజ్ వేళలు

**తేదీ : 03 జూన్ 2025,**
**ఫజర్ : తెల్లవారుజామున గం. 04:30**
**సూర్యోదయం : ఉదయం గం. 05:49**
**జొహర్ : మధ్యాహ్నం గం. 12:18**
**అసర్ : సాయంత్రం గం. 03:42**
**మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:47**
**ఇష : రాత్రి గం. 08:06**





**జన స్వరం**

**విలేకరులు కావలెను**

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..
అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# కిల్ కిల్.. కిలింగ్ కిలింగ్..

**- నాటి సాధారణ రవాణా వాహనం ఏదీ..?**

**- నేడు ప్రపంచ సైకిల్ దినోత్సవం**

కిల్ కిల్ అని శబ్దం వినగానే మనకు గుర్తొచ్చేది సైకిల్, ప్రతి ఒక్కరికి సైకిల్ తొక్కడం నేర్చుకోవాలని, ఎంచక్కా సైకిల్‌పై విహరించాలనే ఉబలాటం ఉంటుంది. పూర్వపు రోజుల్లో తోటల కాడికి దొడ్ల కాడికి, పొరుగు గ్రామాలకు వెళ్లాలంటే సైకిలు ఎక్కువగా ఉపయోగించే వారు. బస్సు సర్వీసులు లేని ఆ రోజుల్లో సైకిల్‌పైనే ఇతర గ్రామాలకు వెళ్లేవారు. కొంత మంది సైకిల్పై విన్యాసాలు చేస్తూ జీవనం గడిపే వారు కూడా ఉండేవారు. సర్కస్లో సైకిల్ విన్యాసాలు అద్భుతంగా ఉంటాయి. ఒకప్పుడు పాఠశాలలకు దూరంగా ఉండే ప్రాంతాల విద్యార్థులు సైకిల్‌నే ఉపయోగించే వారు. అదే పనిగా వారి బిడ్డలకు సైకిల్‌ను తల్లిదండ్రులు కొనిస్తారు. అలాగే సుమారు పది సంవత్సరాలు వయసు వచ్చిన తర్వాత సైకిల్ నేర్చుకోవడం అలవాటు చేసుకుంటారు. కానీ నేటి పిల్లలు నడక నడవడం పూర్తవుగానే సైకిల్ నేర్చుకోవడానికి ఇష్టపడతారు. ఇలా సైకిల్‌కు ఎంతో ఘన చరిత్ర ఉంది. సైకిల్ అనేది సాధారణమైన రవాణా సాధనమని అంటారు. ఇది మనిషి శక్తిని ఉపయోగించి నడపబడే రెండు చక్రాల వాహనం. దీన్ని 19వ శతాబ్దంలో ఐరోపాలో మొట్టమొదటిసారి ఉపయోగించినట్లు తెలుస్తోంది. ప్రపంచంలో చైనా దేశంలో సైకిల్ ఎక్కువగా ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. జర్మనీకి చెందిన కార్ల్ వాన్ డ్రైన్ సైకిల్‌ను కనుగొన్నట్లు తెలుస్తోంది. 1817లో స్విఫ్ట్ వాకర్‌గా పేరు పెట్టారు. మొదట పెడల్స్ లేవు ఇనుప చట్రం కాకుండా చెక్కతో తయారు చేయబడింది. ఇనుప రిమ్లకు లేదర్ టైర్లు అమర్చారు. ఆ తరువాత కొన్ని మార్పులతో అది సైకిల్‌గా రూపాంతరం చెందింది. పూర్వపు రోజుల్లో ఒక్కో గ్రామానికి 5 లేదా 8 సైకిల్లు మాత్రమే ఉండేవి. కాలానుగుణంగా సైకిల్ స్థానంలో వివిధ రకాల బైకులు మార్కెట్లోకి వచ్చాయి. యాంత్రిక జీవనం అలవాటు చేసుకున్న తర్వాత ఇప్పుడు సైకిల్ స్థానంలో బైకులు విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. కాళ్లకు కళాశాలలకు కూడా చాలామంది విద్యార్థులు మోటారు సైకిల్ అనే



ఉపయోగిస్తుండడం విశేషం. నేడు ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి ప్రతి ఏటా జూన్ 3న సైకిల్ దినోత్సవాన్ని జరుపుకోవాలని నిర్ణయించింది. సైకిల్ తొక్కడం వల్ల వ్యాయామం గురించి అవగాహన కల్పించడానికి ఈ దినోత్సవం జరుపుకుంటున్నారు.

**ప్రయోజనాలు - ఇబ్బందులు :**

సైకిల్ తొక్కదం వల్ల ప్రయోజనాలు ఇబ్బందులు గురించి తెలుసుకుందాం.. సైకిల్ తొక్కడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచే వ్యాయామం కూడా. ఇది ఆరోగ్య సంబంధిత సమస్యలను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. కానీ.. సైకిల్ తొక్కడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ, కొంతమందికి ఇది ప్రమాదకరం కూడా కావచ్చు. అవును, మీరు విన్నది నిజమే. కొంతమందికి, సైకిల్ తొక్కడం వల్ల ప్రయోజనం కంటే హాని కలిగించే అవకాశం

## ఎడిటోరియల్

ఉంది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

మూర్ఛరోగులకు.. ఎపిలెప్టిక్ దాడి ఎప్పుడైనా సంభవించవచ్చు. అటువంటి పరిస్థితిలో.. టూర్ సమయంలో బ్యాలెన్స్ కోల్పోవడం వల్ల పడిపోయి తీవ్రంగా గాయపడే ప్రమాదం ఉన్నందున సైక్లింగ్కు దూరంగా ఉండాలి. గుండె జబ్బులతో బాధపడేవారికి ఆకస్మిక శ్రమ హానికరం. దీని కారణంగా.. సైకిల్ తొక్కే ముందు వైద్యుడిని సంప్రదించడం అవసరం. హృదయ స్పందన రేటు, రక్తపోటును దృష్టిలో ఉంచుకున్న తర్వాత మాత్రమే సైక్లింగ్ ప్రారంభించాలి. ఆస్తమా రోగులు సైక్లింగ్ ఆస్తమా రోగులకు సమస్యలను కలిగిస్తుంది. ఇది శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతీ బిగుతు వంటి సమస్యలను పెంచుతుంది. గర్భం దాల్చిన మొదటి నెలల్లో సైకిల్ తొక్కడం మంచిది.. కాని తర్వాతి నెలల్లో జాగ్రత్తగా ఉండండి. సంతులనం కోల్పోయే ప్రమాదం ఉంది. వైద్యుల సలహా మేరకు మాత్రమే సైకిల్ నడపండి. కరోనా తర్వాత ప్రజలు తమ ఆరోగ్యంపై మరింత శ్రద్ధ పెంచుకున్నారు. తమ బిజీ బిజీ జీవితంలో కూడా ప్రజలు రన్నింగ్, జిమ్ లో వ్యాయామం చేయడం ద్వారా తమను తాము ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే ఫిట్గా ఉండేందుకు సైక్లింగ్ ఒక గొప్ప ఎంపిక. పై సమస్యలు ఉన్నవారు తప్ప మిగతా వారు సైక్లింగ్ చేయడం వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదు.



గజ్జల శేషారెడ్డి
సీనియర్ పాత్రికేయులు
పులివెందుల

## మూడు వరాలు ఇవ్వాల్సిందే.. : డాక్టర్ తులసిరెడ్డి



**పులివెందుల, జూన్ 2 (జనస్వరం) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సందర్భంగా అప్పటి కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి మూడు ప్రధాన వరాలు ఇచ్చిందని మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ తులసి రెడ్డి సోమవారం హెచ్చరించారు. ఈ మూడు వరాలు ప్రత్యేక హెూదా, ప్రత్యేక ప్యాకేజీ, విభజన చట్టం ప్రకారం రూ. 5 లక్షల కోట్ల ఆర్థిక సాయమని ఆయన వివరించారు. ఈ వరాలు అమలు అయితే సీమాంధ్రం స్వర్ణాంధ్రంగా ఎదిగేదని ఆయన పేర్కొన్నారు. డాక్టర్ తులసిరెడ్డి మాట్లాడుతూ, విభజన అనంతరం కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీల అధికారంలో రావడంతో ఈ వరాలు అమలు కాకపోవడంతో నిరాశ కలగిందన్నారు. ప్రత్యేక హెూదా హక్కు భిక్ష కాదన్నారు. మోడీ ప్రభుత్వ మోసపూరిత విధానాల వల్ల ఈ వరలు సీరియస్‌గా అమలు కాలేదని విమర్శించారు. అతను ప్రధానంగా రాయలసీమకు కేంద్రం అందించాల్సిన బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ ఇవ్వలేదని, ఈ ప్యాకేజీ రూపంలో సుమారు 5 లక్షల కోట్లు ఆర్థిక సహాయం రాష్ట్రానికి అవసరమని డిమాండ్ చేసారు. అలాగే, కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం నిర్మాణం చేయాలని, దుగ రాజపట్నం వద్ద మేజర్ ఓడ రేవు నిర్మించాల్సిందని, పోలవరం జాతీయ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని, రాజధాని నిర్మాణానికి కేంద్రం నుంచి నిధులు గ్రాంట్ రూపంలో ఇవ్వాలని ఆయన కోరారు. అతను, విభజన చట్టంలోని 9వ, 10వ షెడ్యూల్ల కింద ఉండే సంస్థలను వేరు చేసుకొని రాష్ట్రంలో ఏర్పాటు చేయాల్సిన పనులు పూర్తి కాలేదని, అసెంబ్లీ నియోజకవర్గాలను 175 నుంచి 225కు పెంచకపోవడం, విశాఖ, విజయవాడలో మెట్రో రైలు ప్రాజెక్టులు మొదలుపెట్టకపోవడం, విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయిలో మార్చకపోవడం వంటి అభివృద్ధుల విషయంలో విఫల మైందన్నారు. డాక్టర్ తులసిరెడ్డి చివరగా, టీడీపీ ఆధారంగా కేంద్ర బీజేపీ ప్రభుత్వం నడుస్తున్న నేపథ్యంలో కనీసం ఇప్పుడైనా చట్టం ప్రకారం కేంద్రం నుండి రాష్ట్రానికి రావలసిన మూడు వరలను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

## వ్యాధుల నివారణపై అవగాహనా కార్యక్రమం




**పులివెందుల జూన్ 2 (జనస్వరం) :** నియోజకవర్గంలోని వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వేల్పులలో మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా వేల్పుల గ్రామంలో సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు దోమకాటు వల్ల కలిగే వ్యాధులు ముఖ్యంగా మలేరియా, డెంగ్యూ, గురించి వివరించారు. దోమల వృద్ధిని అరికట్టే విధానాలు, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచడం, నీటి నిల్వలను తొలగించడం, దోమకాటు గురి కాకుండా దోమతెరాలు వాడటం వంటి విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు ఈ వ్యాధులకు గురి కాకుండా వారి కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమేష్, సీహెచ్ఓ వీణా కుమారి, ఆరోగ్య కార్యకర్తలు శ్రీనివాసులు, నాగేశ్వరి, ఆశా కార్యకర్తలు శాంతి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

## కడప అశోక్ నగర్‌లో దారుణ హత్య

**కొడవలితో అల్లుడిని నరికి చంపిన మామ**



**పులివెందుల/కడప, జూన్ 2 (జనస్వరం) :** కడప నగరం అశోక్ నగర్ లో సోమవారం దారుణ హత్య చోటు చేసుకుంది. అల్లుడిని మామ కొడవలితో కిరతకంగా చంపిన సంఘటన కలకలం రేపింది. సయ్యద్ చాంద్ బాషా అనే వ్యక్తి మామ చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు. కొంత కాలంగా సయ్యద్ చాంద్ బాషా కుటుంబంలో మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. భార్య, భర్త మధ్య గొడవల నేపథ్యంలో ఈ హత్య జగినట్లు బంధువులు అనుమానిస్తున్నారు. హత్య అయిన సయ్యద్ చాంద్ బాషాకు ముగ్గురు సంతానం. సంఘటన స్థలానికి చిన్న చౌక్ సిఐ ఓబులేసు, ఎస్సై రవి కుమార్ చేరుకుని విచారిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు వారు ఈ సందర్భంగా వెల్లడించారు.

## ఏలూరు నగర అభివృద్దే లక్ష్యంగా పనిచేయాలి

**మంత్రి కొలుసు పార్థసారథి**

**ఏలూరు, జూన్ 2 (జనస్వరం) :** నగర అభివృద్దే లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి 'ఈడా' చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన పెద్దిబోయిన శివప్రసాద్‌కు సూచించారు. స్థానిక చలసాని గార్డెన్స్‌లో సోమవారం 'ఈడా' చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవ సభలో మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ అంకితభావంతో ప్రజలకు సేవలు చేసే వారికి పదవులు లభిస్తాయడానికి 'ఈడా' చైర్మన్ శివప్రసాద్ నిదర్శనమన్నారు. ప్రజలకు శివప్రసాద్ చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం 'ఈడా' చైర్మన్‌గా నియమించిందని, ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఏలూరు నగరాభివృద్ధికి కృషి చేయాలన్నారు. నామినేటెడ్ పదవులలో సామాజిక నాయ్యం పాటిస్తున్నామని, షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతులు, బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ప్రతిపక్ష నేతలపై కేసులు, హింసించడమే లక్ష్యంగా పనిచేసిందని, ఆనాటి కష్టకాలంలో ఎందరో కార్యకర్తలు, నాయకులు పార్టీకి అండగా నిలబడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన చేస్తున్నదన్నారు. గత ప్రభుత్వం పెన్షన్లు, అమ్మఒడి, చేయూత పథకాలతో సంవత్సరానికి ఒకొక్క కుటుంబానికి రూ. 61 వేలు అందిస్తే, తమ ప్రభుత్వం అంతకుమించి పెన్షన్లు, బకాయిలు, ఉచిత గ్యాస్, తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ పథకాలతో ఒకొక్క కుటుంబానికి సంవత్సరానికి రూ.లక్షా 8వేలు అందిస్తున్నామని, అంతే కాక రానున్న 4 సంవత్సరాలలో రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా మంత్రి లోకేష్ కృషిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని పరిశీలిస్తే రూ.7 లక్షల కోట్లతో రానున్న రెండేళ్ళలో రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారని,



వీటి ఏర్పాటుతో 2027 నాటికి 4.5 లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా పనిచేస్తున్నామన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని, గత ప్రభుత్వం రైతులకు బకాయిలు పడిన ధాన్యం సొమ్ము రూ.1637 కోట్లను తమ ప్రభుత్వం రైతులకు చెల్లించిందన్నారు. రబీ, ఖరీఫ్ లో ధాన్యం అందించిన రైతులకు 24 నుండి 48 గంటలలోగా సొమ్మును రైతుల ఖాతాకు జమచేసి తమ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని నిరూపించుకుందన్నారు. సీఎం చంద్రబాబు, యువనేత లోకేష్ కార్యకర్తల సంక్షేమకోసమే ఆలోచిస్తుంటారని, దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా కార్యకర్తలకు రూ.5 లక్షల భీమా సౌకర్యం కల్పించామన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ పెద్దిబోయిన శివప్రసాద్ క్రమశిక్షణ కలిగిన కార్యకర్త అని అన్నారు. పదవుల కోసం కాకుండా ప్రజల సేవ కోసం పని చేయాలన్నారు. పెద్దిబోయిన శివప్రసాద్ సమర్ధతను పరిశీలించి ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించామని, ఏలూరు నగరంలో సమస్యలను పరిశీలించి వాటిని పరిష్కరించి ఏలూరు నగరాభివృద్ధికి కృషి చేయాలన్నారు. 'ఈడా' చైర్మన్ ప్రమాణస్వీకారం చేసిన పెద్దిబోయిన శివప్రసాద్ మాట్లాడుతూ తనకు ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్‌గా అవకాశం ఇచ్చిన ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి)కి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఏలూరు నగరాభివృద్ధికి తానూ శాయశక్తులా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, కో ఆప్షన్ సభ్యులు ఎస్.ఎం. ఆర్.పెదబాబు, మాజీ మంత్రి మారడాని రంగారావు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, కూటమి నాయకులూ పుప్పాల జగదీష్ బాబు, చోడే వెంకటరత్నం, దాసరి ఆంజనేయులు, మధ్యాహ్నపు బలరాం, ప్రభృతులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి కొలుసు పార్థసారధిని గజమాలతో సత్కరించారు.


## మాజీ ఎమ్మెల్యే విష్ణు వ్యాఖ్యలు అర్ధరహితం



**పులివెందుల జూన్ 2 (జనస్వరం) :** ఆలయ భూములపై మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు చేసిన వ్యాఖ్యలు అంతరహితమని బ్రాహ్మణ చైతన్య వేదిక నాయకులు సూగురు రఘునాథ రావు, పీవీఎస్‌వీ ప్రసా దరావులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయం భూములు కౌలుకు ఇవ్వక దేవస్థానం అధికారులు సాగు చేస్తారా.. గతంలో కూడా ప్రభుత్వం ఇదే విధంగా చేయలేదా అని ప్రశ్నించ్చారు. కౌలు లేదా లీజ్‌కు చేసుకొనే వ్యక్తులు సక్రమంగా దేవాదాయ శాఖకు డబ్బులు చెల్లించేటప్పుడు కొనసాగించడంలో తప్పు లేదన్నారు. గతంలో దేవాలయం భూములు ఖబ్జా చేస్తే మాట్లాడని వ్యక్తులు నేడు మాట్లాడం హాస్యాస్పదమన్నారు. దేవాలయం భూములు విషయంలో కూటమి ప్రభుత్వం ఏదో చేస్తుందని ప్రకటనలు చేయడం మంచిది కాదన్నారు. గత ప్రభుత్వంలో దూపా దీప నైవేద్యం కింద ప్రకటన తప్ప ఆచరణ లేదని, నేడు కూటమి ప్రభుత్వం అమలు చేసిందన్నారు. బ్రాహ్మణ జాతికి హిందూసమాజానికి నష్టం జరగడం లేదని ప్రస్తుత ప్రభుత్వంలో అభివృద్ధి జరుగుతుందని అనవసర విమర్శలు చేయడం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఉండి అన్ని పథకాలు నిర్వీర్యం చేయలేదా అని ప్రశ్నించారు. గరుడ పథకం కింద వందల మంది బ్రాహ్మణలు దరఖాస్తు చేసుకొని ఉన్న ఒక్కటి కూడా పరిష్కారం చేయలేదని, అటువంటి మీరు బ్రాహ్మణల లబ్ధి గురించి మాట్లాడం హాస్యస్పదమన్నారు. అధికారంలో వున్నప్పుడు గుర్తు రాని బ్రాహ్మణులు ఇప్పుడు గుర్తుకొచ్చారా అని ప్రశ్నించారు. మనము చేయలేక వేరొకరిపై ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. శాసన సభ్యుడిగా కార్పొరేషన్ ఛైర్మన్‌గా టీటీడీ బోర్డు మెంబెర్‌గా మీరు బ్రాహ్మణులకు హిందూసమాజానికి చేసిన మేలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అసంబద్ధ ఆరోపణలు మానుకొని, అందరం బ్రాహ్మణ జాతి అభివృద్ధికి పాటుపడదమన్నారు.

## క్రీడల్లో మెరుగ్గా రాణించాలి

**పతకాలు సాధించిన క్రీడాకారులతో శాప్ ఛైర్మన్ రవినాయుడు**



**విజయవాడ, జూన్ 2 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఏపీ తరపున క్రీడల్లో రాణిస్తున్న ప్రతీఒక్కరికీ శాప్ తరపున పూర్తి సహకారం అందిస్తామని, దానికి అనుగుణంగా క్రీడల్లో మరింత మెరుగ్గా రాణించి అత్యధిక పతకాలు సాధించిపెట్టాలని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఆకాంక్షించారు. మహారాష్ట్రలోని పూణేలో మే 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ జరిగిన 3వ కుడో (మార్షల్ ఆర్ట్స్) నేషనల్ ఛాంపియన్‌షిప్ కప్ 2025-26 పోటీల్లో ఏపీ తరపున ప్రాతినిథ్యం వహించిన క్రీడాకారులు స్థానిక శాప్ కార్యాలయంలో శాప్ ఛైర్మన్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వ్యక్తిగత విభాగంలో పాల్గొని 5 గోల్డ్ మెడల్స్, 1 సిల్వర్, 5 బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు శాప్ ఛైర్మన్‌కు వివరిస్తూ మెడల్స్‌ను చూపించారు. ఈ సందర్భంగా వారిని శాప్ ఛైర్మన్ ప్రశంసిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ప్రోత్సహించారు. బీహార్ వేదికగా మే 2వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ జరిగిన 7వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2025 పోటీల్లో సెపక్తక్రా టీమ్ విభాగంలో పాల్గొని బ్రాంజ్ మెడల్ గెలిచినట్లు ఆంధ్రప్రదేశ్ సెపక్తక్రా క్రీడాకారులు శాప్ ఛైర్మన్‌కు వివరించారు. ఈ సందర్భంగా వారిని కూడా శాప్ ఛైర్మన్ అభినందిస్తూ శాప్ నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

# కొల్లేరు ప్రజల జీవన స్థితిగతులకు సైతం కూటమి ప్రభుత్వం తగిన ప్రాధాన్యతనిస్తుంది

**ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్**



**దెందులూరు, జూన్ 2 (జనస్వరం) :** కొల్లేరులో పర్యావరణంతో పాటు స్థానిక కొల్లేటి ప్రజల జీవన స్థితిగతులకు సైతం కూటమి ప్రభుత్వం తగిన ప్రాధాన్యతీస్తుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. కొల్లేరు అంశంపై సీఎం చంద్రబాబు అధ్యక్షతన అమరావతిలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో సహచర ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో కలిసి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల కొల్లేరులో నెలకొన్నటువంటి పరిస్థితుల నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణతో పాటు స్థానికంగా మత్స్యకార జీవనాన్నే ప్రధాన జీవనోపాధిగా జీవిస్తున్న కొల్లేరు ప్రజల స్థితిగతులను కూడా పరిగణలోకి తీసుకోవాలని వారందరికీ ఎటువంటి అభద్రతా భావాలు లేకుండా కూటమి ప్రభుత్వం అండగా నిలిచేలా చర్యలు చేపట్టాలంటూ ఇటీవల ఎమ్మెల్యే కొల్లేటి ప్రజల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి దేశంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు.

# మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి

**ఈ నెల 30వ తేదీ వరకు మలేరియా నివారణ మాసోత్సవాలు**



**ఏలూరు, జూన్ 2 (జనస్వరం) :** దోమలు వ్యాప్తిచెందకుండా తద్వారా జిల్లాను మలేరియా రహిత జిల్లాగా మార్చాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. సోమవారం చింతలపూడి తహశీల్దారు కార్యాలయంలో ఈనెల 30వ తేదీ వరకు నిర్వహించే మలేరియా నివారణ మాసోత్సవాలు సందర్భంగా ముద్రించిన మలేరియా మాసోత్సవ గోడ పత్రికలను, కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటిపరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. నిల్వనీటిలో దోమలు వృద్ధిచెందకుండా లార్వీసైడ్ మందులు స్ప్రే చేయాలన్నారు. డ్రై డే లను పాటిస్తూ నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా ఆర్.మాలిని, చింతలపూడి సబ్ యూనిట్ మలేరియా అధికారి ఎన్.ఏ.ప్రసాద్, రాఘవాపురం, ఎర్రగుంటపల్లి వైద్యధికారులు కె. నరేష్, చైతన్య, ఎంపీహెచ్ఈఓ శ్రీనివారరావు, సూపెర్వైసర్‌లు రవి, ప్రమీలకుమారి, మలేరియా హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు ఉన్నారు.

# వట్లూరు గురుకులంలో కెపాసిటీ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమం ప్రారంభం

**జోన్-2 గురుకుల ప్రిన్సిపాల్స్‌కు మూడు రోజుల శిక్షణ**



**పెదపాడు, జూన్ 2 (జనస్వరం) :** ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ మరియు అజీమ్ ప్రేమ్ జీ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో వట్లూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో మూడు రోజుల కెపాసిటీ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ నెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు జరిగే ఈ శిక్షణా శిబిరంలో జోన్-2 పరిధిలోని అన్ని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాల్స్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వట్లూరు గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీ రాణి మాట్లాడుతూ, "విద్యా వ్యవస్థలో కొత్త నూతన విధానాలు, సంస్థాగత ప్రణాళికలు, మారుతున్న విద్యా ప్రమాణాలపై ఈ శిక్షణ శిబిరంలో చర్చ జరుగుతోంది. గురుకులాల నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఇది ఓ మంచి వేదికగా నిలుస్తోంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అజీమ్ ప్రేమ్ జీ యూనివర్సిటీ నుండి ప్రవీణ్ నాయుడు, తిరంగ్ పాల్గొన్నారు. అంతేగాక, వట్లూరు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది శిక్షణా కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు.

# భీమడోలు పంచాయతీ పరిధిలో ఆకట్టుకున్న యోగాపోటీలు

**యోగా ఆసనాలపై జూనియర్ విభాగంలో పోటీలు**



**భీమడోలు, జూన్ 2 (జనస్వరం) :** ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా తగినంత వ్యాయామం చేస్తూ మంచి పోషకాహారం తీసుకుంటూ యోగా చేస్తూ మంచి జీవన విధానంలో మనిషి జీవనం కొనసాగించాలని ఉంగుటూరు నియోజకవర్గం భీమడోలు పంచాయతీ కార్యదర్శి తనుజా అన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ పరిధిలోని 10 నుండి 18 సంవత్సరాల వయసులోపు కలిగిన వారికి యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగాసనాలలో జూనియర్ విభాగంలో పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో సూర్య నమస్కారంతో పాటు ప్రాణాయామం, మెడిటేషన్‌పై పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన వారికి భీమడోలు పంచాయతీ కార్యదర్శి బి, తనుజా పోటీల్లో గెలిచిన వారిని అభినందించి బహుమతులను అందజేశారు.

# రాష్ట్రంలోనే ఎన్టీఆర్ జిల్లా పోలీస్ విభాగంలో ఆదర్శవంతంగా తయారు కానుంది

- ఎంపీ కేశినేని శివనాథ్
- సత్యనారాయణ పురం పోలీస్ స్టేషన్ నూతన భవనం ప్రారంభం
- ముఖ్యఅతిథులు హాజరైన హోం మంత్రి అనిత, డీజేపీ హరీష్ కుమార్ గుప్తా, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా
- నూతన భవనాన్ని ప్రారంభించిన ప్రజాప్రతినిధులు, పోలీస్ ఉన్నతాధికారులు
- ఎంపీకి స్వాగతం పలికిన ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ
- హోం మంత్రి అనితకు స్వాగతం పలికిన ఎంపీ కేశినేని శివనాథ్



**విజయవాడ, జూన్ 2 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** రాష్ట్రంలోనే పోలీస్ విభాగంలో ఎన్టీఆర్ జిల్లా ఆదర్శవంతమైన జిల్లాగా తయారు కానుందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. సత్యనారాయణపురంలోని ముత్యాలంపాడు స్ట్రీట్, జి.ఎస్.రాజు రోడ్‌లో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన సత్యనారాయణపురం మోడల్ పోలీసు స్టేషన్ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎంపీ కేశినేని శివనాథ్ పూలమొక్క నాటి నీళ్లు పోశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ కేశినేని శివనాథ్‌కి ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ స్వాగతం పలకగా అనంతరం విచ్చేసిన హోం మంత్రి అనితకి ఎంపీ కేశినేని శివనాథ్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. పోలీస్ స్టేషన్ భవనాన్ని హోం మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించగా, ఈ పోలీస్ స్టేషన్‌లోని అధికారుల రూమ్లు, సెంట్రీ, రిసెప్షన్, మహిళా హెల్ప్ డెస్క్‌లతోపాటు సీడీఆర్ అనాలసిస్, సైబర్ క్రైమ్, సీసీటీఎన్ఎస్, ఎల్‌హెచ్ఎంఎస్, ఫెసియల్ రికగ్నైజేషన్ కెమెరాలు, మొదలగు విభాగాలను ఎంపీ కేశినేని శివనాథ్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వర రావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ నగరంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం సీసీ కెమెరాలు, డ్రోన్స్, పోలీస్ స్టేషన్ ఆధునీకరణకు సహరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు, హెూం మినిస్టర్ అనిత ఆధ్వ ర్యంలో రాబోయే రెండు మూడు ఏళ్లలో రాష్ట్రంలోని ప్రతి పోలీస్ స్టేషన్ మోడరన్ పోలీస్ స్టేషన్‌గా తయారవుతుందన్నారు, పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు నేతృత్వంలో కార్పొరేట్ కార్యా లయానికి దీటుగా సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ నిర్మాణం జరిగిందని కొనియాడారు. ఈ పోలీస్ స్టేషన్‌లో ఎవరైనా సంతకం చేయాల్సి వస్తే.. సంతకం కాకుండా థంబ్ ఇంప్రెషన్ వేసి వెళ్లిపోయే విధంగా బయో మెట్రిక్ సిస్టమ్ ఏర్పాటు చేయటం బాగుందన్నారు. ఇలాంటి మోడరనైజేషన్ రాష్ట్ర వ్యాప్తంగా జరగాలని ఆకాంక్షించారు. ఇప్పటికే జిల్లాలో జగ్గయ్యపేట, విజయవాడ పశ్చిమ నియోజకవర్గాల్లో మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయ టం జరిగిందని.. అలాగే నందిగామలో 80శాతం సీసీ కెమెరాలు నియోజకవర్గం అంతా ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఇదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం పై భారం పడకుండా దాతలు ముందు వచ్చి పోలీస్ స్టేషన్ల ఆధునీకరణకు, సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని ఎంపీ కేశినేని శివనాథ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు కేజీవీ సరిత, తిరుమలేశ్వర రెడ్డి, ఏబీటీఎస్ ఉదయరాణి, కృష్ణమూర్తి నాయుడు, ఎస్‌విడిప్రసాద్‌లతో పాటు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# కౌలు రైతుల సమస్యలపై భీమడోలులో ధర్నా

- కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందించాలి
- ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు డిమాండ్



**భీమడోలు, జూన్ 2 (జనస్వరం) :** కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందించాలని, భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గ్రామ సభలు నిర్వహించి గుర్తింపు కార్డులు ఇచ్చి వడ్డీ లేని పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో భీమడోలు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కో కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి కౌలు రైతుకు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20వేలు అందించాలని కోరారు. గత ప్రభుత్వం ఓసి కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించలేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కౌలు రైతులకు కొత్త చట్టం తీసుకువచ్చి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు చట్టం తీసుకురావలేదని విమర్శించారు. కౌలు రైతుల చట్టం వెంటనే తీసుకురావాలని కోరారు. వాస్తవ సాగుదారులకు పెట్టుబడి సాయం అందకపోవడం వలన ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ యజమాని సంతకాలతో నిమిత్తం లేకుండా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి వడ్డీ లేని పంట రుణాలు అందించాలని కోరారు. కౌలు రైతుల సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలన్నారు. అనంతరం స్పందన కార్యక్రమంలో మండల ఎంపీడీఓకు, మండల వ్యవసాయ అధికారికి వినతిపత్రం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు జి ప్రసాదరావు, జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా సహాయ కార్యదర్శి కోన శ్రీనివాసరావు, కౌలు రైతులు పాల్గొన్నారు.

# జేఈఈ ఫలితాల్లో న్యూక్లియస్ ప్రభంజనం

- కష్టపడితే ఫలితాలు తథ్యం
- విద్యార్థుల అభివృద్ధే కళాశాల ధ్యేయం
- కరస్పాండెంట్ మురళీధర్ రెడ్డి



**నంద్యాల, జూన్ 2 (జనస్వరం) :** విద్యార్థుల కృషి, అధ్యాపకుల పట్టుదల కలిసివచ్చినప్పుడు అద్భుత ఫలితాలు సాధ్యమవుతాయని న్యూక్లియస్ జూనియర్ కళాశాల మరోసారి నిరూపించింది. జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎస్.మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ, "మా కళాశాలలో కష్టపడి చదివించే అధ్యాపకులు ఉన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యా విధానంతో విద్యార్థుల అభివృద్ధే మా లక్ష్యం" అని అన్నారు. జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో ఓసీ కేటగిరీలో అనీషా తబసుమ్ 10,280 ర్యాంకు, ఎస్సీ కేటగిరీలో ఎస్. లికిత్ 1,145 ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. ఇతర విద్యార్థుల్లో టి. ప్రదీప్ 2,949 ప్రిపరేటరీ ర్యాంకు, కే. సతీష్ 4,610 ప్రిపరేటరీ ర్యాంకు, ఎస్. అమూల్య 5,486 ప్రిపరేటరీ ర్యాంకును సాధించినట్లు తెలిపారు. వీరంతా ఐఐటీ ప్రవేశాలకు అర్హత సాధించినట్లు వెల్లడించారు. కళాశాల డైరెక్టర్ వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ, గతంలో ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో కూడా న్యూక్లియస్ విద్యార్థులు అద్భుతంగా రాణించారని, నిట్ సీట్లు పొందే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. రాబోయే నీట్ ఫలితాలలో కూడా న్యూక్లియస్ కళాశాల నుంచి కనీసం 5 మెడికల్ సీట్లు వచ్చే అవకాశముందని తెలిపారు. గత సంవత్సరాలలోనూ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి మెడిసిన్ సీట్లు పొందారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# యోగా ఆరోగ్య ప్రధాయిని

**యోగా చేస్తున్న ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది**



**ఏలూరు, జూన్ 2 (జనస్వరం) :** యోగా ఆరోగ్య ప్రధాయిని అని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య తెలిపారు. సోమవారం వట్లూరు టిటిడిసిలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో 50 మంది ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. యోగా ట్రైనర్ యోగాసనాలు వేయిస్తూ యోగా వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ సందర్భంగా ఆవులయ్య మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో యోగా తప్పనిసరి అన్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందన్నారు. జీవితంలో యోగా సాధనతో ఆరోగ్య పరిరక్షణతోపాటు జ్ఞాపకశక్తి, చురుకుదనం, సంతోషంగా జీవించడానికి అవకాశం కలుగుతుందన్నారు.

# వెన్నుపోటు దినం వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**ఎంపీపీ అనూష దేవి**



**చింతపల్లి, జూన్ 2 (జనస్వరం) :** గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కోరాబు ఎంపీపీ అనూష దేవి తీవ్రస్థాయిలో విమర్శించారు. సోమవారం జడ్పిటీసీ పోతురాజు బాలయ్య, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు దురియా పుష్పలతతో కలిసి ఆమె వెన్నుపోటు దినం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ సీఎం, వైసీపీ అధినేత, పులివెందుల ఎమ్మెల్యే జగన్ పిలుపు మేరకు జూన్ 4న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న వెన్నుపోటు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సంఘీభావం తెలిపారు.

# టీచర్ల బదిలీల కష్టాలు తీరేనా?

- సీనియార్టీ లిస్టు అంతా తప్పులతడికే
- గ్రీవెన్స్ ఫిర్యాదులపై స్పందించని విద్యాశాఖ



**నంద్యాల, జూన్ 2 (జనస్వరం) :** ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసేది ఒకరకంగానూ, బదిలీలు జరిపేది మరోరకంగానూ ఉన్నాయని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తే కనీసం అధికారుల నుంచి స్పందన లేదని టీచర్ల బదిలీలు కష్టాలు తీరేది ఎప్పుడు అని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మౌలాలి, రాష్ట్ర నాయకుడు సుబ్బారాయుడు జిల్లా నాయకుడు నరసింహారావులు పేర్కొన్నారు. సోమవారం ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో ఆన్లైన్ బదిలీల విధానంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యలను సరిచేయడానికి ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ విభాగంలో బదిలీల్లో ఉన్న కష్టాలను టీచర్లు తమ సమస్యలను విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్లగా ఎలాంటి పరిష్కారం చూపించకుండానే పరిష్కారం చేసినట్లుగా సమాచారాన్ని పొందుపరచడం ఎంతవరకు సబబని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల బదిలీల సీనియార్టీ లిస్టు అంతా తప్పుల తడకగా ఉందని, సరిచేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఏమాత్రం స్పందించడం లేదన్నారు. విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా, సీనియారిటీ లోపాలను సరి చేయకుండా అధికారులు నిర్లక్ష వైఖరితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ సుబ్బయ్య, హెడ్మాస్టర్ శ్రీనివాసరావు, సంఘ నాయకులు ప్రభాకర్, సుబ్బయ్య, వెంకటేశ్వరరావు, వేణు గోపాల్ శ్రీరాములు ఎయిడెడ్ వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీసీలు ఓటు బ్యాంకు గానే ఉండాలా?

- రాజ్యాధికారం కోసం పోరాడుదాం
- బీసీ చైతన్య వేధిక రాష్ట్ర కార్యదర్శి



**నంద్యాల, జూన్ 2 (జనస్వరం) :** రాష్ట్రంలో రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో మాత్రమే బీసీల జపం చేస్తూ, అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలను విస్మరిస్తున్న రాజకీయ పార్టీలకు గుణపాఠం చెప్పాలన్న లక్ష్యంతో బీసీ చైతన్య వేదిక రాష్ట్ర కార్యదర్శి నందవరం శ్రీనివాసులు పేర్కొన్నారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో బీసీ చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షులు అన్నం వెంకటేశ్వరరావుల సారధ్యంలో నిర్వహించారు. జిల్లా నుండి బీసీ చైతన్య వేదిక రాష్ట్ర కార్యదర్శిగా నందవరం శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్రములో బీసీలు ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయ పార్టీలకు గుర్తుకు వస్తారని, ఎన్నికల అనంతరం బీసీల పరిస్థితి, అధోగతిగా మారిపోతుందని ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్రంలో బీసీలు 65 శాతం ఉన్నపటికీ, అగ్రవర్ణాల చేతుల్లో బీసీల భవిష్యత్తు ఉందని, ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా బీసీలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగంలోని బీసీల హక్కుల పోరాటం చేయడానికి ముందడుగు వేయాలన్నారు. బీసీ చైతన్య వేదికను ప్రతి ఒక్కరూ పాల్గొని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఐక్యమత్యంతో అందరం పోరాడి రాజ్యాధికారం సాధించుకుందామని శ్రీనివాసులు పేర్కొన్నారు.

# తిరువూరు నగర పంచాయతీని అభివృద్ధి దిశగా నడిపిస్తాం

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
- తక్షణం తాగునీరు, నగర పారిశుద్ధ్యం, రోడ్లు అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ సమస్యల పరిష్కారానికి కృషి
- ప్రశాంతంగా ముగిసిన తిరువూరు నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక
- చైర్ పర్సన్‌గా ఎన్నికైన 1వ వార్డ్ కౌన్సిలర్ కె.నిర్మల
- చైర్ పర్సన్‌కి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కొలికపూడి
- ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కొలికపూడికి కృతజ్ఞతలు తెలిపిన నూతన చైర్ పర్సన్ కె.నిర్మల



**తిరువూరు, జూన్ 2 (జనస్వరం ప్రత్యేక ప్రతనిధి) :** నాలుగేళ్లుగా నగర పంచాయతీలో అభివృద్ధి జరగకుండా వైసీపీ నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించింది. తక్షణం తిరువూరు పంచాయతీ అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు మొదలు పెట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. తిరువూరు నగర పంచాయతీ కార్యాలయంలో జరిగిన చైర్మన్ ఎన్నిక సోమవారం ప్రశాంతంగా ముగిసింది. టీడీపీ బలపరిచిన 1వ వార్డు కౌన్సిలర్ కె.నిర్మలకు ఎమ్మెల్యే ఓటుతో పది మంది కౌన్సిలర్లు మద్దతు పలికారు. దీంతో కె.నిర్మల నగర పంచాయతీ చైర్ పర్సన్‌గా ఎన్నిక అయ్యారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ కార్యాలయానికి విచ్చేసిన ఎంపీ కేశినేని శివనాథ్‌కు ఎన్డీఏ కూటమి నేతలు ఘన స్వాగతం పలికారు. చైర్ పర్సన్‌గా ఎన్నికైన కె.నిర్మలకు ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నగర పంచాయతీ అభివృద్ధి కాంకిస్తూ టీడీపీలో చేరిన కౌన్సిలర్లను ఎంపీ కేశినేని శివనాథ్ అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ తిరువూరులో నగర పంచాయతీ చైర్ పర్సన్ ఎన్నిక ప్రశాంతంగా నిర్వహించారు. ఈ ఎన్నికకు ముఖ్య కారణం నాలుగేళ్లుగా నగర పంచాయతీలో కౌన్సిలర్లు ఎలాంటి అభివృద్ధి చూడకపోవటమన్నారు. వైసీపీ ప్రభుత్వం తిరువూరు అభివృద్ధిపై నిర్లక్ష్య ధోరణి వహించిందన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి చేసుకోవాలనే ఉద్దేశ్యంతో కొంతమంది కౌన్సిలర్లు టీడీపీలో చేరినట్లు తెలిపారు. విజయవాడకు చెందిన వైసీపీ గుండాలు తిరువూరు నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక సందర్భంగా అలజడి సృష్టించేందుకు ప్రయత్నించగా తెలుగు తమ్ముళ్ల తిరుగుబాటుతో వెను తిరిగినట్లు తెలిపారు. వైసీపీ నాయకులు కౌన్సిలర్లను వారి కుటుంబాలకు దూరం చేసి క్యాంపు రాజకీయాలు నడిపినట్లు తెలిపారు. తాము క్యాంపు రాజకీయాలు నడపలేదని, టీడీపీ కౌన్సిలర్లు తిరువూరులోనే స్వేచ్ఛగా కుటుంబ సభ్యులతో వారి నివాసాల్లోనే ఉన్నారని తెలిపారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్‌గా కె.నిర్మల ఎన్నిక కావటంతో ఇక నుంచి తిరువూరు పట్టణం అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. పట్టణంలో నెలకొన్న ప్రధాన సమస్యలైన తాగునీరు, నగర పారిశుద్ధ్యం, రోడ్లు అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరించే విధంగా ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నగర పంచాయతీ అభివృద్ధికి సహకారం అందించి అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేస్తానని తెలిపారు. తిరువూరు నగర పంచాయతీ చైర్మన్ ఎన్నికకు సహకరించిన ఎన్డీఏ కూటమి నేతలకు మీడియాకు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ 20 రోజులుగా కొంత మంది తిరువూరులో అలజడి సృష్టించి రాజకీయంగా లబ్ధి పొందాలని ప్రయత్నం చేసి విఫలమయ్యారన్నారు. తిరువూరు నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆ అరాచక శక్తుల్ని విజయవంతంగా నియంత్రించారని కొనియాడారు. ఎంతో ప్రశాంతంగా నగర పంచాయతీ ఎన్నిక పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ నాయకత్వంలో తిరువూరు నగర పంచాయతీకి కృషి చేస్తామన్నారు. వర్ష కాలం రానున్న నేపథ్యంలో ఎక్కడ మురుగు నీరు నిల్వ ఉండకుండా, దోమలు చేరకుండా ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించే కార్యచరణ తయారు చేసి తక్షణం అమలు జరిగే విధంగా చూస్తామన్నారు. 20 రోజులుగా రాజకీయంగా ఎన్ని ఒడిదుడుకులు ఉన్నా సరే చాలా ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన పోలీస్ శాఖకు, మీడియాకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నూతన చైర్ పర్సన్ కె.నిర్మల మాట్లాడుతూ తనకి ఈ అవకాశం కల్పించిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలిపారు. నగర పంచాయతీ అభివృద్ధికి తన వంతు కృషి చేసి ప్రజలు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తల నమ్మకాన్ని వమ్ము కాకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ షేక్ అబ్దుల్ హుస్సెన్, కౌన్సిలర్లు నాళ్ల సురేంద్ర, జి.సత్యవతి, దుర్గరావు, పరసా సత్యనారాయణ, సుందర్ కుమార్, శేఖర్ బాబు, నీలిమ, కస్తూరి బాయి, జిల్లా తెలుగు రైతు సంఘం అధ్యక్షులు చెరుకూరి రాజేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి మాదల హరిచరణ్ (కిట్టు), తిరువూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మోదుగు వెంకటేశ్వరరావు, స్టేట్ బీసీ సెల్ నాయకులు కందిమళ్ల శేషగిరిరావు, టీడీపీ సీనియర్ నాయకులు సంకురాత్రి జనార్ధన్ రావు, తాళ్లూరి రామారావు, బీజేపీ నాయకులు నంబూరి శ్రీనివాసరావు, తోట భవానీ, జనసేన నాయకులు ఉయ్యూరు జయప్రకాష్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## దెందులూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా వడ్లపట్ల విజయకుమార్



**దెందులూరు, జూన్ 2 (జనస్వరం) :** దెందులూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా వడ్లపట్ల విజయకుమార్ విధులలో చేరారు. ఈయన గతంలో రాచూరు హైస్కూల్లో పనిచేసి గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చి ఉన్నారు. వారికి పాఠశాల సిబ్బంది ఉపాధ్యాయులు, ఉపాధ్యాయతర సిబ్బంది, విద్యా కమిటీ చైర్మన్ బొచ్చు కనక కిషోర్, కమిటీ మెంబర్లు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ శ్రీ గారపాటి హైమావతి స్కూల్‌ను అభివృద్ధి పదంలో నడిపించడానికి తన వంతు కృషి చేస్తానని, అలాగే విద్యార్థులకు విద్య పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటానని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయతర సిబ్బంది సహకరించాలని, స్కూలుకు సంబంధించి పనులను వాయిదా వేయకుండా సత్వరమే పనులను పూర్తిచేస్తే పాఠశాల అభివృద్ధి చెందుతుందని విజయకుమార్ అన్నారు. విజయ్ కుమార్‌ని పాఠశాల ఉపాధ్యాయులు భాస్కర్ ప్రసాద్, ఆశీర్వాదం, విజయానంద్, మల్లారెడ్డి, నారాయణ, లావణ్య, పద్మ, సాయిరాం, వెంకటేష్, గోపాల్, గ్రంథ పాలకులు గుళ్ళ పూడి వెంకటేశ్వర రావు, నైట్ వాచ్మెన్, సిబ్బంది అందరూ ఆహ్వానం పలికి ప్రధాన ఉపాధ్యాయులు చెప్పిన విధంగా నడుచుకుంటూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తామని తెలియజేశారు. విజయ్ కుమార్‌ని విధుల్లో చేర్చేందుకు రాచూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నుండి ఐదుగురు ఉపాధ్యాయులు ఆయన వెంట వచ్చి ప్రధానోపాధ్యాయులను విధుల్లో చేర్చి వారి ఔన్నత్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారికి విజయ్ కుమార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## వైసీపీ చేసిన పాపం కూటమి ప్రభుత్వానికి చుట్టుకుంది

**జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బుజ్జిబాబు**





**చింతపల్లి, జూన్ 2 (జనస్వరం) :** గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య పాలన అడవి తల్లి గిరిజన గ్రామాలను అభివృద్ధికి దూరంగా నిలిపిందని, ఆ పాలన వల్ల చెల్లిన పాపం నేడు కూటమి ప్రభుత్వ మెడకు చుట్టుకుని ఇబ్బందులకు గురిచేస్తోందని జనసేన పార్టీ చింతపల్లి మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు విమర్శించారు. సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు సాగిన బాలకృష్ణతో కలిసి కుడుముసారి పంచాయతీ పరిధిలోని జడుగూరు గ్రామాన్ని సందర్శించిన ఆయన స్థానిక గిరిజను లతో సమావేశమై గ్రామ సమస్యలపై అవగాహన కలిగి, వివిధ అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన 78 ఏళ్ల పూర్తయిన మారుమూల గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల లేమి కొనసాగుతుండడం దురదృష్టకరమన్నారు. నాడు-నేడు పేరుతో పాఠశాలల రూపురేఖలు మార్చుతామని హామీ ఇచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్మాణాలు ప్రారంభ దశలోనే నిలిపేసి ఆదివాసీ గ్రామాలకు విద్యా అవకాశాలను దూరం చేసిందని విమర్శించారు. గ్రామం లో 30 మంది చిన్నారులకు అంగన్‌వాడీ భవనం లేకపోవడం, 42 మంది విద్యార్థులకు పాఠశాల భవనం లభించకపోవడం దుర్వినియోగ పాలనను స్పష్టం చేస్తుందని చెప్పారు. గ్రామస్థులు దివ్య ఔషధంగా గుణాలు కలిగిన ఊట గడ్డను పరిశీలించిన ఆయన తాగునీటి వనరులపై ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామానికి తారు రోడ్డు, మంచి నీటి సరఫరా వంటి అవసరమైన మౌలిక వసతులు లేకపోవడం తీవ్రంగా ఆవేదన కలిగిస్తోందని పేర్కొన్నారు. ఈ సమస్యలను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు పాంగి సుబ్బారావు, కొర్ర కృష్ణ, టీడీపీ బూత్ కమిటీ సభ్యులు కొర్ర గిరి తదితరులు పాల్గొన్నారు.

## సంరక్షణ లేని గోవులను గోశాలకు తరలిస్తాం

**చింతపల్లి సర్పంచ్ పుష్పలత**



**చింతపల్లి, జూన్ 2 (జనస్వరం) :** రోడ్లపై సంరక్షణ లేకుండా తిరుగుతున్న గోవులు ప్రమాదాలకు కారణమవుతున్న నేపథ్యంలో గోవుల యజమానులు వాటి సంరక్షణపై బాధ్యత తీసుకోకపోతే, గోవులను గోశాలకు తరలించి యజమానులపై జరిమానాలు విధిస్తామని చింతపల్లి సర్పంచ్ దురియా పుష్పలత హెచ్చరించారు. పట్టణం అభివృద్ధిలో భాగంగా నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారితో పాటు చింతపల్లి ప్రధాన రహదారులపై రాత్రి సమయంలో గోవులు నిద్రిస్తుండటం వలన తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. పాలను పొందిన తర్వాత గోవులను నిర్లక్ష్యంగా రోడ్లపై వదిలేస్తున్న యజమానుల తీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రివేళల్లో రోడ్లపై గోవులు చెత్తను తింటూ తిరగడం, వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉండటం వలన వాహన చోదకులతో పాటు గోవుల ప్రాణాలు కూడా కోల్పోతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులపై జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, గోవుల యజమానులు తమ పశువులను సంరక్షించుకోవాలని ఆమె సూచించారు. సూచనలు పట్టించుకోని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే గోవులను గోశాలకు తరలించి, యజమానులపై జరిమానాలు విధిస్తామని ఆమె స్పష్టం చేశారు.


## ఇప్పటికైనా డ్రంక్ అండ్ డ్రైవింగ్ నియంత్రించాలి

**లోక్ సత్తా భాను ప్రసాద్**

**చిలకలూరిపేట, జూన్ 2 (జనస్వరం) :** ఇటీవల నేషనల్ హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన హెూంగార్డు శ్రీనివాసరావు, ఆయన కుమారుడిని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర నాయకుడు మాదాసు భాను ప్రసాద్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడుపుతూ వెనక నుండి బలంగా గుద్దడం వల్లే ప్రమాదం జరిగిందని శ్రీనివాసరావు వివరించారని చెప్పారు. అలాగే, కొన్ని నెలల క్రితం కోటప్పకొండ రోడ్డుపై విధులు నిర్వహించి వస్తున్న ఓ కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఘటనను గుర్తు చేశారు. చిలకలూరిపేట పట్టణం, పరిసర ప్రాంతాల్లో రోడు ప్రమాదాలు నిత్యం చోటుచేసుకుంటున్నాయని, ఇప్పటికైనా అధికారులు డ్రంక్ అండ్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్ లాంటి అశాస్త్రీయ రవాణా ప్రయాణాలను కట్టడి చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై చట్టాలను కఠినంగా అమలు చేయాలని, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆపాలని భాను ప్రసాద్ కోరారు.

## జగన్‌కు వెన్నుపోటు దినం కాదు.. పశ్చాత్తాప, ప్రాయశ్చిత్త, సంతాప దినాలు అవసరం

**మాజీ మంత్రి ప్రత్తిపాటి**



**చిలకలూరిపేట, జూన్ 2 (జనస్వరం) :** "జూన్ 4న 'వెన్నుపోటు దినం'కు జగన్ ఇచ్చిన పిలుపు వెనుక నిజమైన ఉద్దేశం ఏమిటి?" అని టీడీపీ నేత, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. గత ఎన్నికల్లో ప్రజలు వైసీపీని తీవ్రంగా తిరస్కరించి కేవలం 11 సీట్లకే పరిమితం చేయడాన్ని జగన్ "వెన్నుపోటు"గా భావిస్తున్నారా? అంటూ ఆయన మండిపడ్డారు. ప్రత్తిపాటి మాట్లాడుతూ, "ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును గౌరవించని నాయకుడిగా జగన్ చరిత్రలో మిగిలిపోతాడు. రాష్ట్ర అభివృద్ధికి నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలన్న ఆలోచన కూడా జగన్‌కు లేదంటే దురదృష్టకరం," అన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజాప్రియ పాలనపై అసహనం, అసూయతో జగన్ తనకే తానే వెన్నుపోటు పొడుస్తున్నాడని వ్యాఖ్యానించారు. "తండ్రికి వెన్నుపోటు.. బాబాయ్‌కి గొడ్డలిపోటు.. తానే నమ్మిన కుట్రలతో కోడికత్తి గాటు, గులకరాయి గీటు.. ఇవే జగన్ రాజకీయాలు" అని తీవ్రంగా విమర్శించారు. అధికారానికి, సానుభూతికి ప్రయోజనాల కోసం జగన్ ఎన్నో మోసపూరిత డ్రామాలు ఆడాడని ఆరోపించారు. "జగన్ చేయాల్సింది వెన్నుపోటు దినం కాదు.. పశ్చాత్తాపం, ప్రాయశ్చిత్తం, సంతాప దినాలు" అని పుల్లారావు హితవు పలికారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో బాధపడ్డ లక్షలాది కుటుంబాలకు సంఘీభావంగా జగన్ ఏడాది పాటు పశ్చాత్తాప దినాలు పాటించాలన్నారు. రాష్ట్రాన్ని దోచుకున్న దుర్మార్గ పాలనకు క్షమాపణలు చెబుతూ ప్రజల్లో తిరిగి ప్రాయశ్చిత్తం చేయాలన్నారు. "జగన్ రాజకీయాల్లో తండ్రిని మోసం చేశాడు, బాబాయ్‌ను ప్రాణాలు తీసే దాకా వెళ్లాడు, తనపై కోడికత్తి దాడి జరిపించుకున్నాడన్న అనుమానాలు రేపుతున్న విధానాలే అతని పాలనను నిర్వచించాయి," అంటూ ఆయన వ్యాఖ్యానించారు. "వాస్తవంగా చూస్తే జగన్‌కు వెన్నుపోటు పిలుపు గౌరవ దినం కాదు.. అది నిస్సహాయత, నైతిక పరాజయం గుర్తు చేసే ఓ జ్ఞాపకం మాత్రమే" అని ప్రత్తిపాటి వ్యాఖ్యానించారు.

## సాయంత్రం చింతపల్లి ఆకాశాన్ని ఆరగించిన ఎర్రటి కాంతులు

**సూర్యాస్తమయ దృశ్యం మంత్రముగ్ధం చేసిన ప్రకృతి ప్రేమికులు**



**చింతపల్లి, జూన్ 2 (జనస్వరం) :** చింతపల్లి పర్వత ప్రాంతం సోమవారం సాయంత్రం ఓ అపూర్వమైన ప్రకృతి దృశ్యానికి వేదిక అయింది. సంధ్యాసమయంలో సూర్యుడు విడిచిన ఎర్రటి కాం తులు ఆకాశాన్ని గులాబీ, ముదురు ఎరుపు రంగులతో కళకళలాడించాయి. కొండల మధ్య నుంచి పరచుకున్న కాంతి, పలుచటి మేఘాల మధ్య పొదిగిన రంగులు అపురూప దృశ్యాన్ని మలచాయి. ఈ ఆకర్షణీయమైన ప్రకృతి కాంతులాట స్థానికులను, సందర్శకులను మంత్రముగ్ధులను చేసింది. శాంతమైన వాతావరణం మధ్య అలరించిన ఈ దృశ్యం పర్యాటకులలోనూ, ఫొటో గ్రాఫ ర్లలోనూ ఉత్తేజం కలిగించింది. ప్రకృతి ప్రేమికులు సెల్ఫీలు, ఫోటోలు తీసుకుంటూ ఈ క్షణాలను స్మృతిగా నిలిపారు. అటవీ ప్రాంతానికి సమీపంగా ఉన్న ఈ ప్రాంతం తరచూ ఇలాంటి దృశ్యాలకు నిలయంగా మారుతోంది. ప్రకృతి ప్రేమికులకు ఇది ఒక ఆహ్లాదకర గమ్యస్థానంగా రూపుదిద్దుకుంటోంది.

## కొత్తూరు గ్రామంలో కమ్యూనిటీ యోగా విజయవంతం చేయండి

**ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్**




**యలమంచిలి, జూన్ 2 (జనస్వరం) :** నియోజకవర్గంలోని రాంబిల్లి మండలం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9న 2000 మందితో భారీ కమ్యూనిటీ యోగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. యోగా సాధనను సమాజానికి చేరవేసేందుకు ప్రతివారూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు థీమ్ బేస్డ్ యోగా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనకాపల్లి జిల్లాలోని కొత్తూరు గ్రామం ధనదెబ్బలో యోగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా రెండు కోట్ల మందితో యోగా కార్యక్రమాలు జరగనున్నట్లు చెప్పారు. కూడనే, పర్యావరణ పరిరక్షణలో భాగంగా తడి చెత్త-పొడి చెత్త కోసం ప్రత్యేక డస్ట్ బిన్లను కొత్తూరు గ్రామానికి అందజేశారు. స్వచ్ఛ గ్రామాలుగా మారేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. "నిజంగా నేను ప్రజల కోసం పని చేయని రోజు వస్తే, వెంటనే రాజీనామా చేసి వెళ్ళిపోతాను. ప్రజల కోసమే ప్రజాప్రతినిధులుగా పని చేయాలి. పార్టీలు మారినా, బాధ్యత మారకూడదు" అని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొండపల్లిలో కరెంట్ షాక్‌తో మృతి చెందిన బడవత్ గోపి కుటుంబానికి జనసేన పార్టీ సానుభూతి



**విజయవాడ, జూన్ 2 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** మైలవరం నియోజకవర్గానికి చెందిన కొండపల్లి మున్సిపాలిటీలో కరెంట్ షాక్‌కు గురై అప్రమత్తంగా ప్రాణాలు కోల్పోయిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు బడవత్ గోపి కుటుంబాన్ని జనసేన పార్టీ పరామర్శించింది. ఈ సందర్భంగా సోమవారం విజయవాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, శాసనమండలి సభ్యులు కొణిదెల నాగబాబు, పార్టీ తరఫున రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని గోపి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర నాయకుడు హరిప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, మైలవరం నియోజకవర్గ ఇంచార్జ్ అక్కల రామ మోహన్ రావు (గాంధీ), జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, మున్సిపాలిటీ అధ్యక్షుడు చెరుకుమల్లి సురేష్ పాల్గొన్నారు. క్రియాశీలక వాలంటీర్లు అశోక్ బాబీ, బూరం శంకర్, ఎర్రంశెట్టి సాయి, రమేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జనసేన పార్టీ ఎప్పుడూ తన కార్యకర్తల పట్ల బాధ్యతాయుతంగా ఉండే పార్టీగా మరోసారి నిరూపించుకున్నదని నాయకులు అన్నారు.

## వైసీపీ నాయకుల పైశాచిక చర్యలు హేయం


**జనసేన నాయకుడు నాగుర్ వలి**



**నకరికల్లు, జూన్ 2 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** వైసీపీని ప్రజలు ఓటుతో తీవ్రంగా తిరస్కరిం చినా, కొందరు నాయకుల్లో మాత్రం మార్పు తలసరి కాకుండా, పైశాచిక వైఖరితో వ్యవహరి స్తున్నారని జనసేన పార్టీ నకరికల్లు మండల వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ నాగుర్ వలి తీవ్ర స్థాయిలో విమర్శించారు. సోమవారం నకరికల్లులో విలేకరులతో మాట్లాడిన ఆయన, ఇటీవల ఇబ్రహీం పట్నంలో చోటుచేసుకున్న ఘటనను ఉదహరిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగుర్ వలి చెప్పిన వివరాల ప్రకారం, మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడి వివాహ సందర్భంగా జరిగిన వేడుకలో ఓ చిన్నారి సైకిల్ తొక్కుతూ వెళ్తుండగా, కొందరు వైసీపీ అనుచరులు ఆ సైకిల్‌ను లాక్కొని, దానిపై విచక్షణలేని తీరును ప్రదర్శించారన్నారు. ఆ చిన్నారిని ఏడిపిస్తూ మానవత్వం మరిచి సైకిల్‌ను గాలిలో తిప్పి, నేలకేసి కొట్టి, కాళ్లతో తన్నటం వంటి క్రూర చర్యలకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. "ఇది కేవలం ఓ చిన్నారిపై చేసిన అఘాయిత్యమే కాదు, ప్రజాస్వామ్యాన్ని, మానవత్వాన్ని అవమానపరిచే చర్య. ఓ రాజకీయ పార్టీ గుర్తు ఉన్న సైకిల్‌ను చూసి ఇలా ప్రవర్తించటం అరాచకానికి పరాకాష్ట," అని సయ్యద్ నాగుర్ వలి అన్నారు. ఈ ఘటనపై బాధ్యత వహించే వారిని తక్షణమే గుర్తించి, కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని, పోలీసు యంత్రాంగాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు వైసీపీ నాయకత్వం ఇప్పటికీ ప్రజల తీర్పును గుర్తించకపోవడానికే నిదర్శనమని, ప్రజల కళ్ల ముందే వీరు తమ నిజమైన చరిత్రను మరోసారి బయటపెడుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## ఎన్సీసీలో విద్యార్థుల్లో దేశభక్తి పెరుగుతుంది

**జిల్లా జడ్జి**



**నంద్యాల, జూన్ 2 (జనస్వరం) :** స్థానిక శ్రీ రామకృష్ణ కళాశాల నందు జరుగుతున్న 9వ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ ఎన్సీసీ క్యాంపులో జరుగుతున్న ఫైరింగ్ కార్యక్రమాన్ని పరిశీలించిన మూడవ అదనపు జిల్లా జడ్జి అమ్మన్న రాజా సోమవారం పరిశీలించారు. శ్రీరామ్ కృష్ణ పీజీ కళాశాల ఆవరణంలో జరుగుతున్న ఎన్సిసి క్యారెట్స్ పది రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా మూడవదనపు జడ్జి అమ్మన్నరాజా సోమవారం పరిశీలించారు. ఎన్సీసీ ఫైరింగ్ కార్యక్రమం పరిశీలించి తాను కూడా స్వయంగా ఫైరింగ్‌లో పాల్గొన్నారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ ఎన్సీసీలో పాల్గొనడంవలన విద్యార్థుల్లో దేశభక్తి పెరుగుతుందని, సామాజిక అవగాహన కలుగుతుందని తెలిపారు. క్యాంపు నిర్వహిస్తున్న ఎన్సీసీ అధికారులకు స్థలం కేటాయించిన శ్రీ రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు అధికారులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా జనసేన పార్టీ ఉంటుంది

**ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను**



**మంగళగిరి జూన్ 2, (జనస్వరం) :** స్థానిక ఆర్ ఆర్ ఆర్ కన్వెన్షన్ హాల్లో గతంలో ప్రమాదవశాత్తు మరణించిన జనసేన పార్టీ కార్యకర్తల కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేశారు. జగ్గయ్యపేట నియోజకవర్గానికి చెందిన గిజ్జ గోపీచంద్, మైలవరం నియోజకవర్గానికి చెందిన బడావత్ గోపి, విజయవాడ తూర్పు నియోజకవర్గానికి చెందిన కృప మనోజ్, దొండపాటి చంద్రశేఖర్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన ఆవల సాయి ఫణిందర్, లింగమ సాయి రంగనాథ్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన పోతుల దుర్గారావు కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 5 లక్షల రూపాయలు అందజేశారు. ఈ చెక్కులను జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు, ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు సామినేని ఉదయభాను చేతుల మీదుగా పంపిణీ చేశారు. సామినేని ఉదయభాను మాట్లాడుతూ, "జనసేన పార్టీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పార్టీలో వ్యక్తిగతంగా కూడా వనరులను వాడి కార్యకర్తల కోసం ఇన్సూరెన్స్ చేయించడం ప్రత్యేకత అని" పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ హరిప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు అమ్మిశెట్టి వాసు, మండలి నాయకులు, వివిధ జిల్లా జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళా నేతలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కార్మికుల 8 వారాల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి : సీఐటీయూ



**యలమంచిలి, జూన్ 2 (జనస్వరం) :** అచ్చుతాపురం మండలం మల్లవరం, జగన్నాథపురం గ్రామాల్లో ఉపాధి హామీ కార్మికులు పని ప్రదేశాల్లో ఆందోళన నిర్వహించి, 8 వారాల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. రాము పేర్కొన్నారు, ఉపాధి హామీ కార్మికులు అర్ధాహారం పరిస్థితుల్లో జీవిస్తున్నారని, వేతనాలు 8 వారాలుగా బకాయి ఉండడం అన్యాయం కావచ్చునని తెలిపారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని, పని చేస్తున్న కార్మికులకు మంచినీరు, మజ్జిగ వంటివి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పార, తట్ట, గునపంకి డబ్బులు చెల్లించాలని, వేసవి వేతనం సహా 30 శాతం అదనంగా చెల్లించాలని, కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడాన్ని ఆపాలని ఆర్.రాము హితవాక్యాలు పలికారు. ఉపాధి హామీ కార్మికులకు సంవత్సరానికి కనీసం 200 రోజులు పని కల్పించి, రోజుకి రూ.600లు వేతనం ఇవ్వాలని, కొలతలతో సంబంధం లేకుండా ప్రభుత్వం ప్రకటించిన జీవో ప్రకారం కనీసం రూ.307లు వేతనం చెల్లించాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులను సమగ్రంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. అంతేకాదు, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, వేతనాలు ప్రతి వారం చెల్లించాలని హెచ్చరించారు. అవసరమైతే మరింత ఆందోళనలు చేపడతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


## కూటమి పాలనలో సుపరిపాలనకు ఏడాది పూర్తి



**యలమంచిలి, జూన్ 2 (జనస్వరం) :** నియోజకవర్గంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సుపరిపాలనలో ఏడాది పూర్తయిందని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్‌లో వైసీపీ పాలనకు ప్రజలు గుడ్ బై చెప్పి ఈ కూటమి పాలనను సపోర్టు చేస్తున్నారని, ఈ సందర్భంగా జూన్ 4న సంక్రాంతి, దీపావళి పండుగలను కలిసి జరుపుకుందామని ఎమ్మెల్యే విజయ్ కుమార్ ప్రతిపాదించారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో, రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సుపరిపాలన చేయడం ద్వారా ఒక వసంత కాలం పూర్తయిందని పేర్కొన్నారు. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు ఈ శుభకారణంగా పండగగా జరుపుకునేలా రంగవల్లులు అలంకరించుకోవడం, మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించడం, సాయంత్రం దీపావళి లాంటి దీపప్రదీపాల ద్వారా పీడ విరగడను గుర్తు చేసుకోవడం సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మైనింగ్ అవినీతిపై సీబీఐ విచారణ జరిపించండి

- మైనింగ్ మాఫియాను నిరోధించండి
- సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం సమర్పణ



**నెల్లూరు, జూన్ 2 (జనస్వరం) :** జిల్లాలోని సైదాపురం మండలంలో వేల కోట్ల రూపాయల విలువచేసే తెల్లరాయి దొంక తిరుగుడుగా చెన్నై ద్వారా చైనా చేరడం దాని వెనుకున్న నేతల హస్తం నిగ్గు తేల్చాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కే సంజయ్ కుమార్, ఇన్చార్జి కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ముడి ఖనిజం అవినీతి కేసులో ఇప్పటికే మాజీ మంత్రి విచారణ ఎదుర్కొంటున్నాడని, మైనింగ్ అధికారులు విజిలెన్స్ రెవెన్యూ పోలీస్ అధికారులు ఈ విషయంపై ఎందుకు మౌనంగా ఉన్నారో అర్థం కావటం లేదన్నారు. ఎంత ముడి ఖనిజం అక్రమంగా తొవ్వితీశారో డబ్బు ఎవరి చేతుల్లో మారిందో, దీని వెనుక ఎంత మంది పెద్దల హస్తం ఉన్నా శిక్షించాలని కోరారు. ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీ రాకుండా సహజ వనరులు దోపిడీ చేశారన్నారు. దీనిపైన సీబీఐ విచారణ జరపాలని కాంగ్రెస్ తరపున డిమాండ్ చేస్తున్నట్లు సంజయ్ తెలిపారు. అంతేకాకుండా కార్పొరేట్ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు విద్యార్థుల స్కూల్ ఫీజులు ఇష్టానుసారంగా పెంచేస్తున్నారని, దీనివల్ల తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక అప్పుల పాలు అవుతున్నారని సిటీ జనరల్ సెక్రెటరీ అడ్వకేట్ సుధీర్, రూరల్ కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో సిటీకాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఇర్ఫాన్, మైనార్టీ నాయకులు అల్లావుద్దీన్, సేవాదళ్ సుజాత, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఆక్రమణలకు ఏ కులం వాడైనా శిక్షర్హుడే

**సర్పంచ్ సంయుక్త**



**రైల్వేకోడూరు, జూన్ 2 (జనస్వరం) :** నియోజకవర్గంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో మైసూరు వారిపల్లి సర్పంచ్ సంయుక్త మాట్లాడుతూ "గత రెండు రోజులుగా మా పంచాయతీలోని 2085 సర్వే నెంబర్ భూమిని పేద దళితుల నుండి బలవంతంగా లాక్కొంటున్నారు. దీనికి సంబంధం లేని మా రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్రపై కుల కార్డును ఉపయోగించి దిగజారుడు విమర్శలు చేయడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. చట్టం ముందు అందరూ సమానమే. ఇలా ఫేక్ న్యూస్ సృష్టించి వీడియోలు తీసి ఆయనపై రుద్దాలనుకోవడం సిగ్గుచేటు. దీనికి వెనుక ఉన్నవాళ్లకు ఒకటే చెబుతున్నాను. నాగేంద్ర మాట్లాడినట్టు నిరూపిస్తే నేను సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తాను," అంటూ సవాల్ విసిరారు. రాష్ట్ర స్థాయిలో తాతంశెట్టి నాగేంద్ర అంటే తెరచిన పుస్తకం వంటివారు. ఆయన లాగా పనిచేయలేకపోతే ఇలాంటివి చేయడం తగదు. చేతనైతే ప్రజలకు ఆయనలాగా పనిచేయాలని, కుట్రలు పన్నడం తగదని, దీని వెనుక ఉన్న సన్నాసులకు గట్టిగా హెచ్చరించారు. అసలు ఆరోపణలు చేసిన జయరామయ్యకు నాగేంద్ర ఎవరో కూడా తెలియదన్నారు. నిజమైన భూ ఆక్రమణదారుడు జయరామయ్యే అని పేర్కొన్నారు. చట్టం ముందు అందరూ సమానమే. అతనికి ఉన్న పాస్‌బుక్, పేపర్స్ అన్నీ ఫేక్ అని అధికారులు స్పష్టం చేశారు. అయినప్పటికీ ఇలాంటి పనులకు పూనుకోవడం తగదన్నారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ వరలక్ష్మి మాట్లాడుతూ "నాగేంద్ర, మా కుటుంబ సభ్యులు పగడాల చంద్రశేఖర్, వెంకటేష్‌పై చేస్తున్న ఫేక్ ఆరోపణలపై కులం పేరుతో మాట్లాడారని నిరూపిస్తే నేను కూడా పదవికి రాజీనామా చేస్తాను," అంటూ ఆమె సవాల్ విసిరారు. "పవన్ అన్న ఆశయాలకు తోడుగా ముస్లిం సమాజానికి ప్రార్థనల కోసం స్థలం కేటాయించాలన్న నిర్ణయం పెద్దలు తీసుకున్నారు. ఇలాంటి ఉన్నత ఆశయాలతో ముందుకు వెళ్లే నాగేంద్రపై కులం కార్డు ఉపయోగించి అసత్య ఆరోపణలు చేయడం తగదు. చట్టం ముందు అందరూ సమానమే," అని చెప్పారు. జనసేన శ్రేణుల తరపున ఆలం రమేష్ మాట్లాడుతూ"ఆ భూమికి హైకోర్టు స్టే నేను తెచ్చాను. అక్కడ మాదిగలకు చెందిన జయరామయ్య ఒక్కడికే సంబంధం ఉంది. ప్రభుత్వం మాత్రం క్లియర్ చేయలేదు. బలిజ సామాజిక వర్గానికి చెందిన వారి భూములను కూడా తొలగించారు," అని తెలిపారు. "గౌరవ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం వంక పోరంబోకులో ఎలాంటి కట్టడాలు ఉండకూడదు. ఇలాంటి భూములకు బుక్కులు, పేపర్లు ఉండవు. సామూహికంగా వాడుకోవడం తప్పు, ఆక్రమించి తమ భూములుగా చూపడం తగదు," అని అన్నారు. "మా నాయకుడిపై చేస్తున్న ఆరోపణలు దమ్ముంటే నిరూపించాలి," అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వరలక్ష్మి, సర్పంచ్ సంయుక్త, ఆలం రమేష్, మాదాసు నరసింహ, పసుపులేటి వెంకటరమణ, సాదు కిషోర్, నాగోల్ అమర్నాథ్, దళిత నాయకులు బీదం నవీన్, సింగనమాల రామ్మూర్తి, కనుపర్తి శంకరయ్య, కంచర్ల సుధీర్ రెడ్డి, పసుపులేటి రమణ, గొబ్బూరు హరి, షేక్ రియాజ్, పగడాల శివ, తుపాకుల పెంచలయ్య, సువారపు హరి ప్రసాద్, అబ్బిగారి శివ, బందిల చక్రి, లింగం మణి తదితర జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**కొల్లి అప్పారావు**



**యలమంచిలి/రాంబిల్లి, జూన్ 2 (జనస్వరం) :** ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం జరిగిన జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి రోజైన ఈ నెల 9న ప్రతి గ్రామంలో హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సమరసతా సేవా ఫౌండేషన్ యలమంచిలి సబ్‌డివిజన్ కార్యదర్శి కొల్లి అప్పారావు పిలుపునిచ్చారు. సోమవారం రాంబిల్లి శ్రీ పైడితల్లమ్మ ఆలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 21న యోగా దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని, అలాగే ప్రతి నెలా దేవాలయాల ఆధ్వర్యంలో పౌర్ణమి రోజున సామూహిక హారతి, వారానికి ఒకసారి భజన కార్యక్రమం, ఏకాదశి రోజున నగర సంకీర్తన వంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను పాటించేలా గ్రామస్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, గ్రామస్థాయిలో వీటిని భక్తి శ్రద్ధలతో నిర్వహించాలని కోరారు. సమావేశంలో మండల కన్వీనర్లు చింతకాయల గగన్ కుమార్, కారే రాముడు, గణేష్, చక్రీ, సుమంత్, వెంకన్న, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## 34, 35 డివిజన్లలో ఘనంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి జన్మదిన వేడుకలు



**విజయవాడ, జూన్ 2 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** స్థానిక నగరంలోని 34, 35వ డివిజన్లలో ఎమ్మెల్యే సుజనా చౌదరి జన్మదిన వేడుకలు సోమవారం ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ వేడుకలకు టీడీపీ, బీజేపీ నేతలతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా 35వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్ రాజ్, టీడీపీ అధ్యక్షురాలు నందకుమారి, 34వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కొండా, 34వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వెంకటేష్, బీజేపీ నాయకురాలు బొడ్డు నాగలక్ష్మి పాల్గొని సుజనా చౌదరికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వేదికపై కేక్ కట్ చేయడం, పూలగుచ్చాలు అందజేయడం, మిఠాయిల పంపిణీతో వేడుకలు ఉత్సాహంగా సాగాయి. స్థానిక ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, సభ్యులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీలో కష్టపడిన వారికి పదవులు

**ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను**



**విజయవాడ, జూన్ 2 (జనస్వరం) :** ఆంధ్రప్రదేశ్ హ్యాండీ క్రాఫ్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్‌కి, ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా సోమవారం ప్రమాణస్వీకారం చేసిన మండపేట నియోజకవర్గ ఇన్చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణకి ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామి నేని ఉదయభాను పుష్పగుచ్చాలు ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ జనసేన పార్టీలో కష్టపడిన వారికే జనసేన పార్టీ అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ఈ పదవుల ఎంపిక కార్యక్రమం జరుగుతుందని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో కూడా జనసేన పార్టీ కోసం కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు, కచ్చితంగా పదవులు లభించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఇతర రాజకీయ పార్టీలకి లేని సిద్ధాంతాలు కేవలం జనసేన పార్టీకే ఉన్నాయని తెలిపారు. సిద్ధాంతాలకు కట్టుబడి నాయకులు జనసేన శ్రేణులు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్, జనసేన పార్టీ నాయకులు మద్దెల రామకృష్ణ, డాక్టర్ కొండవీటి సంతోష్ కృష్ణ, న్యాయవాది కొంపల్లి అరుణ్ కుమార్, కొండవీటి ఈశ్వర్, నాంచారయ్య, పోతిరెడ్డి రమణ, పల్లిశెట్టి తేజ, కొమ్మవరపు భాను ప్రసాద్, రాజా నాయుడు, కమ్మిల రాజేశ్వరి, రుద్ర శేఖర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఈడా చైర్మన్‌గా పెద్ది బోయిన శివ ప్రసాద్ ప్రమాణ స్వీకారం


**జనసేన నేతల శుభాకాంక్షలు**



**ఏలూరు, జూన్ 2 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక చలసాని గార్డెన్స్‌లో సోమవారం కొత్తగా ఈడా (ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ) చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన పెద్దిబోయిన శివ ప్రసాద్‌కు జనసేన పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నేతలు నగిరెడ్డి కాశీ నరేష్, సరిది రాజేష్, కస్తూరి సాయి తేజస్విని, రెడ్డి గౌరీ శంకర్, వీరంకి పండు, జనసేన రవి, బోండా రాము నాయుడు, వేముల బాలు, ఆనంద్, వాసు నాయుడు, యడ్లపల్లి మమతా తదితరులు పాల్గొన్నారు. పెద్ది బోయిన శివ ప్రసాద్‌కు ఏలూరు పట్టణ అభివృద్ధిలో సక్రమమైన మార్గదర్శకత్వం అందించాలని నేతలు ఆశాభావాలు వ్యక్తం చేశారు.

## నియోజకవర్గాల పునర్విభజనలో పొత్తు ధర్మం పాటించిన నాయకులందరికీ న్యాయం జరుగుతుంది

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా వేగుళ్ళ లీలా కృష్ణ ప్రమాణ స్వీకారం
- ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వెగుళ్ల జోగేశ్వరరావు హాజరు
- ఎంపీ కేశినేని శివనాథ్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసిన లీలా కృష్ణ
- లీలా కృష్ణకి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించిన ఎంపీ కేశినేని శివనాథ్



**విజయవాడ, జూన్ 2 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** త్వరలో జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనలో కూటమి పొత్తు ధర్మం పాటించిన నాయకులందరికీ న్యాయం జరుగుతుందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గవర్నపేటలోని ఆంధ్రప్రదేశ్ సమగ్ర జలవనరుల నిర్వహణ, శిక్షణ కేంద్రంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా వేగుళ్ళ లీలా కృష్ణ పదవీ బాధ్యత ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులు ఎంపీ కేశినేని శివనాథ్, మండపేట ఎమ్మెల్యే వెగుళ్ల జోగేశ్వరరావు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన వేగుళ్ళ లీలా కృష్ణకు ఎంపీ కేశినేని శివనాథ్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలపటంతోపాటు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి సందర్భంగా సీట్ల సర్దుబాటులో పొత్తు ధర్మం పాటించిన ముఖ్య నాయకుల్లో వేగుళ్ల లీలా కృష్ణ ఒకరని కొనియాడారు. టీడీపీ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు గెలుపులో లీలా కృష్ణ కీలక పాత్ర పోషించారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకు వెళ్లాల్సిన సమయం ఇదని.. పదవులు రాలేదని నాయకులు కార్యకర్తలు నిరాశ పడవద్దన్నారు.. అందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో పలు కేసులతో పాటు అనేక దాడులు ఎదుర్కొన్న లీలా కృష్ణ భవిష్యత్తులో ఉన్నత పదవుల అలంకరించాలని ఆకాంక్షించారు. వేగుళ్ళ లీలా కృష్ణను రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు సామినేని ఉదయభాను, జనసేన పార్టీ రాష్ట్ర నాయకుల అమ్మిశెట్టి వాసు, ప్రియా సౌజన్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తిరుమలరావులతో పాటు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ధ్యేయం

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కె.ఎస్.జవహర్
- కె.ఎస్.జవహర్‌కు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించిన ? ఎంపీ కేశినేని శివనాథ్
- తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా కె.ఎస్.జవహర్ ప్రమాణ స్వీకార మహోత్సవం



**విజయవాడ, జూన్ 2 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. తమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా మాజీ మంత్రి కె.ఎస్.జవహర్ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీ కేశినేని శివనాథ్ ఎస్సీ కమిషన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన కె.ఎస్.జవహర్‌కు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం చేసినట్లు తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలను అమలు చేయటం కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రప్రథమంగా టీడీపీ రాష్ట్ర వ్యాప్తంగా సర్వే నిర్వహించి జస్టిస్ పున్నయ్యను చైర్మన్‌గా చేసి ఎస్సీ కమిషన్ ఏర్పాటు చేసిన ఘనత టీడీపీ సొంతమన్నారు. మాజీ మంత్రి కె.ఎస్.జవహర్ ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా రాష్ట్రవ్యాప్తంగా షెడ్యూల్ కులాలకి సంబంధించిన సమస్యలను పరిష్కరించటంలో వారికి అండగా నిలబడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు అశీష్ లాల్, టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, జిల్లా తెలుగు రైతు సంఘం అధ్యక్షులు చెరుకూరి రాజేశ్వరరావు, గంపల గూడెం తెలుగు యువత అధ్యక్షుడు మాణికొండ రామకృష్ణ(ఎమ్.ఆర్.కె) టీడీపీ సీనియర్ నాయకులు తాళ్లూరి రామారావు, టీడీపీ నాయకుడు కొత్తపల్లి ఆనంద్ స్వరూప్‌లతోపాటు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదవ తరగతి అత్యుత్తమ ర్యాంకర్లకు
# రిటైర్డ్ జిల్లా విద్యాశాఖ అధికారి గుర్రాల రామకృష్ణయ్య ప్రతిభా పురస్కారాల ప్రదానం

**అలరించిన బాలల సాంస్కృతిక ప్రదర్శనలు**



**నంద్యాల, జూన్ 2 (జనస్వరం) :** కళారాధన సాంస్కృతిక సంస్థ నంద్యాల, నంద్యాల ఐఎంఏ, లయన్స్ క్లబ్ సంయుక్త నిర్వహణలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక శాఖ సహకారంతో నెలరోజులపాటు నిర్వహించిన 24వ ఉచిత లలిత కళల వేసవి శిక్షణ శిబిరం కళా సాధన ముగింపు ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. కళారాధన అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రవి కృష్ణల నిర్వహణలో జరిగిన ఈ ముగింపు వేడుకలలో శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి, ప్రముఖ న్యాయవాది టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెదుర్ల రామచంద్రరావు, మార్క్ ఫెడ్ డైరెక్టర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాతి రెడ్డి తులసి రెడ్డి, సూరన సారస్వత సంఘం అధ్యక్షులు డాక్టర్ గెలివి సహదేవుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త వర్ధం శెట్టి రాజారాం అతిథులుగా పాల్గొన్నారు.పదవ తరగతిలో జిల్లా స్థాయిలో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన లక్ష్మీ ఇంగ్లీష్ మీడియం స్కూల్కు చెందిన ఇష్రత్, బాలాజీ కాంప్లెక్స్ కేశవరెడ్డి స్కూలుకు చెందిన కాత్యాయని, గురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కి చెందిన నర్సి రెడ్డి, ప్రభుత్వ పాఠశాలలలో ప్రథమ స్థానం సాధించిన, పాములపాడు మోడల్ స్కూల్‌కు చెందిన మల్లన్న, శ్రీశైలం బీసీ వెల్ఫేర్ స్కూల్ కు చెందిన ద్వితీయ స్థానం సాధించిన రమజాన్, ఎల్లా వత్తుల జిల్లా పరిషత్ స్కూల్‌కు చెందిన నాగేంద్రబాబు, తృతీయ స్థానం సాధించిన బండి ఆత్మకూరు జిల్లా పరిషత్ స్కూల్‌కు చెందిన సుమంత్, పాములపాడు మోడల్ స్కూల్‌కు చెందిన యశస్వినిలకు రిటైర్డ్ జిల్లా విద్యాశాఖ అధికారి విద్యావేత్త గుర్రాల రామకృష్ణయ్య ప్రతిభా పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒత్తిడి తట్టుకుని ప్రశాంతంగా, మానసిక ధైర్యంతో విజయాలు సాధించాలంటే కళలు, క్రీడల పట్ల ఆసక్తి కలిగి పాల్గొనడం ఎంతో ఉపకరిస్తుందన్నారు. కళారాధన అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రవికిష్ణ, క్యాంపు కోఆర్డినేటర్ రంగనాథ్ మాట్లాడుతూ ఈ శిక్షణ శిబిరాలు నిర్వహించడం ఇది 24వ సంవత్సరం అని, ప్రతి ఏటా 300 నుండి 400 మంది బాలబాలికలకు 30 మంది శిక్షకులతో 20 రకాల అంశాలలో నెలరోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చి శిక్షణానంతరం వారితో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శిక్షణ పొందిన 400 బాలబాలికలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. శిక్షణ పొందిన బాలబాలికలు ప్రదర్శించిన శాస్త్రీయ, ఆధునిక నృత్యాలు, శాస్త్రీయ, ఆధునిక గానాలాపన, వాద్య సంగీతం, పద్య పఠనం, సంస్కృత శ్లోకాలు, కరాటే, తైక్వాండో ప్రదర్శనలు అహుతులను విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో కళారాధన కార్య నిర్వాహక కార్యదర్శులు రవి ప్రకాష్, అన్నెం శ్రీనివాసరెడ్డి, పత్తి రంగనాథ్ ఐఎంఏ నంద్యాల కార్యదర్శి డాక్టర్ పనిల్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్ కార్యదర్శి శిరిగిరి రమేష్, కోశాధికారి మామిళ్ల నాగరాజు, కళారాధన సంయుక్త కార్యదర్శులు డీసీపీ శర్మ, శేష ఫణి, సోమేశుల నాగరాజు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# రేషన్ దుకాణాలతో పారదర్శక ప్రజా పంపిణీ

**సర్వేపల్లి నియోజకవర్గంలో కొత్త యోజనలు**



**సర్వేపల్లి, జూన్ 2 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** నియోజకవర్గంలో జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు మీడియా సమావేశంలో రేషన్ దుకాణాల ద్వారా పారదర్శకంగా ప్రజా సరుకుల పంపిణీ విధానాలను వివరించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సమావేశంలో రాష్ట్రంలో 29,761 రేషన్ షాపుల ద్వారా సుమారు 1.46 కోట్ల కుటుం బాలకు సరుకులు పంపిణీ అవుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడైనా రేషన్ కార్డుతో లబ్ధిదా రులు తమకు సమీపంలోని ఏ రేషన్ షాపు నుంచైనా సరుకులు పొందే సౌకర్యం కల్పించడం వలన ప్రజలకు మరింత సౌకర్యంగా మారిందని వివరించారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే రేషన్ సరుకులు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రముఖ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, రేషన్ పంపిణీ వ్యవస్థలో అవకతవకలు లేకుండా కట్టుదిట్ట నియంత్రణతో పని జరుగుతుందని, ఇలాంటి మార్పుల ద్వారా ప్రభుత్వానికి రూ.385 కోట్లు ఆదా అవుతున్నాయని తెలిపారు. ఆదివారం పిఠాపురం పట్టణంలో రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ రేషన్ షాపులు నెల రోజులో రెండు సార్లు తెరిచి ఆదివారాలనూ సేవలు అందిస్తున్నట్లు, డీలర్లు సరైన పని తీరు కలిగి ఉంటే భవిష్యత్తులో సాం కేతికతను మరింతగా వినియోగించుకుని మరిన్ని మెరుగుదలలు తీసుకురాబోతున్నామని చెప్పారు. రేషన్ పంపిణీ కోసం కొత్త యాప్ అభివృద్ధి చేసి, ఎప్పటికప్పుడు పంపిణీ వివరాలు నమోదు చేయడం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, అలాగే సమస్యలపై ఫిర్యాదులు సులభంగా చేయడం కోసం షాపుల వద్ద క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయడం వంటి పలు వినూత్న చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అంతేకాక కాకినాడ, విశాఖ పోర్టుల వద్ద రైస్ స్మగ్లింగ్‌పై కట్టుదిట్ట భద్రతతో పాటు పేద లకు అందాల్సిన రేషన్ సరుకులు ఎక్కడా మాఫియా చేతుల్లోకి పోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా ప్రజలకు న్యాయమైన, సమయానుకూలమైన రేషన్ సేవలు అందించడమే కాకుండా ప్రభుత్వ నిధుల ఆదా కూడా జరుగుతోందని ఈ కార్యక్రమంలో వక్తలు అభిప్రాయపడ్డారు.

# 21న ప్రధాన మంత్రి విశాఖపట్నం వస్తే పోలీసులు భద్రత కల్పించగలరా?

- **సామాన్యులకు భద్రత ఇవ్వలేని పోలీస్ డిపార్ట్మెంట్**
- **కలెక్టర్ దృష్టికి జాతీయ మానవ హక్కుల కమిషన్ కేసు**
- **నిందితులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు వినతి పత్రం**
- **విశాఖను బీహార్ లాగా తయారు చేశారు**
- **గాజువాక ఒక మాఫియాలో తయారయింది**
- **మనుషుల్ని చంపేసినా పట్టించుకోని పోలీసుల**
- **తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్**




**విశాఖపట్నం, జూన్ 2 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** రాష్ట్ర ప్రభుత్వం పై జాతీయ మానవ హక్కుల కమిషన్కు ఫిర్యాదు చేసిన విషయాన్ని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంద్ర ప్రసాద్ దృష్టికి సోమవారం ఉదయం తీసుకెళ్లినట్లు అలాగే నిందితుల పై చర్యలు తీసుకోవాలని,హోటల్ వద్ద జరిగిన సంఘటన తాలూక సిసీ ఫుటేజ్ బయట పెట్టాలని కోరినట్లు తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ తెలిపారు. కేసు డైరీ నెంబర్ 124787/ఐఎన్/2025గా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం మీద కేసు నమోదైన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ తనపై దాడి జరిగి మూడు వారాలు అయినప్పటికీ పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినప్పుడు ఆయన సానుకూలంగా స్పందించారు. అయితే సిటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ చెప్పిన గాజువాక ఏసిపి, సీఐ ఆయన మాటలు కూడా లెక్క చేయడం లేదు. కేసు నమోదు చేయడంలేదు. విశాఖను బీహార్ లాగా తయారు చేశారు. గాజువాక అంతా ఒక మాఫియాలో తయారయింది. సామాన్యులకు భద్రత ఇవ్వలేని పోలీస్ డిపార్ట్మెంట్.. 21న ప్రధాన మంత్రి విశాఖపట్నం వస్తే భద్రత కల్పించగలరా అనే అనుమానం వ్యక్తం చేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, వారి అనుచరులు వంద మందికి పైగా నాపై దాడికి పాల్పడ్డారని, గాజువాక పోలీసులకు పిర్యాదు చేసినా, పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినా కేసు నమోదు చేయలేదన్నారు. జిల్లా మెజిస్ట్రేట్‌గా కలెక్టర్ దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మనుషుల్ని చంపేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**పల్లా ముఖ్య అనుచరుడు మురళినే ప్రధాన నిందితుడు :**

పల్లా శ్రీనివాస్ ముఖ్య అనుచరుడు మురళి నాపై దాడికి సూత్రదారి అని, మిగతా వాళ్లని ప్రేరేపించి, పురిగొల్పి నాపై దాడి చేయించారని చెప్పారు. 100 మంది వరకు నా మీదకి దాడి చేసేందుకు వచ్చారన్నారు. నాపై జరిగిన హత్యాయత్నంలో ప్రసాదుల శ్రీనివాస్ ప్రమేయం కూడా ఉందన్నారు. పల్లా శ్రీనివాస్‌తో పాటు వీరిపైన కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# వైభవంగా ఉండ్రాజవరంలో సోమాలమ్మ తల్లి వార్షికోత్సవం

**ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన**





**దెందులూరు, జూన్ 2 (జనస్వరం) :** మండలంలోని ఉండ్రాజవరం గ్రామంలో గ్రామ మంచినీటి చెరువుగట్టుపై స్వయంభువుగా వెలసిన అమ్మలగన్నమ్మ, ముగ్గురమ్మల మూలపుటమ్మ, ఉండ్రాజవరం గ్రామాన్ని కంటికి రెప్పవలె కాపాడే చల్లని తల్లి శ్రీ సోమాలమ్మ తల్లి అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం అమ్మవారి ఆలయం వద్ద ఆలయ కమిటీ, గ్రామ ప్రజల సహాయ, సహకారాలతో గొప్ప అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉండ్రాజవరం పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



**పాయకరావుపేట, జూన్ 2 (జనస్వరం) :** మండలంలోని అరట్లకోట గ్రామంలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం జనసేన అధ్యక్షులు తుమ్మల గణేష్ మాట్లాడుతూ "వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించడం శుభ పరిమాణం. రైతులు రసాయన ఎరువులు ఉపయోగించడం వలన భూమి సారం తగ్గి, దిగుబడి తగ్గుతుంది. ఈ పంట వినియోగం వలన ప్రజలు అనారోగ్యానికి గురవుతారు. అదే సేంద్రియ ఎరువులు ఉపయోగించడం వలన పంట దిగుబడి అధికంగా ఉంటుంది. ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహించడం కొరకు రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశ పెట్టారు. వీటిని రైతులందరూ వినియోగించుకుని అధిక లాభాలు పొందాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు, హార్టికల్చర్ సహాయ అధికారిణి రమ్య, గ్రామ ఉపసర్పంచ్ తూము రమణ, టీడీపీ అధ్యక్షులు కట్టా శ్రీను, జనసేన అధ్యక్షులు తుమ్మల గణేష్, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మల బాబ్జీ, గర్లంక కత్తులు, చిట్టిపాళ్ల బాబ్జీ, తూము బాబ్జీ, గర్లంక శివ కృష్ణ, శాస్త్రవేత్తలు, అధికారులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

# వాహన చోదకులు.. అనర్ధకమైన అలవాట్లు విడనాడి.. జాగ్రత్తలు పాటించండి

**ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు**

శంఖవరం, జూన్ 2 (జనస్వరం) : వాహనాలను నడిపే యువత కొన్ని అనర్ధకమైన అలవాట్లను విడనాడి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రత్తిపాడు సీఐ బి సూర్య అప్పారావు అన్నారు. మండలంలోని ఉప ప్రణాళిక ప్రాంతమైన పెదమల్లాపురం గ్రామంలోని రామాలయం సెంటర్ వద్ద గిరిజన యువకులకు, గిరిజనులకు రోడ్డు ప్రమాదాల నివారణపై జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సూచనలతో ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు, అన్నవరం ఎస్సై శ్రీహరిబాబు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూర్య అప్పారావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో పెదమల్లాపురం వెళ్లే రోడ్లో జరిగిన మోటార్ సైకిల్ ప్రమాదంలో యువకులు మృతి చెందిన విషయం విధితమే. రోడ్డు ప్రమాదాలకు ముఖ్యంగా అతివేగం మద్యపానం సేవించడం వంటి అనర్ధకమైన అలవాట్లు కారణంగా రూడీ అవుతున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించడం వల్ల ప్రమాదాల్లో ప్రాణాపాయం నుండి చాలా వరకు సురక్షితంగా బయటపడవచ్చన్నారు. శంఖవరం నుండి పెదమల్లాపురం వెళ్లే రహదారి నూతన నిర్మాణం కావడంతో వాహనాలు అతివేగంగా నడపడం ప్రమాదాలకు కారణంగా కనబడుతుందన్నారు. వీటి నివారణకు ముఖ్యమైన మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పంచాయతీరాజ్ డిఇ పత్తిపూడి వారికి అర్జీ పెట్టడం జరిగిందన్నారు. యువత ముఖ్యంగా సోషల్ మీడియాలో వచ్చే లింకులను ప్రెస్ చేయొద్దని, ఆన్లైన్లో బెట్టింగులు ఆడొద్దని, ఆన్లైన్లో రుణాలు తీసుకోవద్దని, వీటి ద్వారా ఆర్థికంగా నష్టపోయి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు, గిరిజనులు, గిరిజన యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ లక్ష్యం

- **రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**
- **వినతులు ఇచ్చేందుకు భారీగా తరలివచ్చిన ప్రజలు**



**కోటబొమ్మాళి, జూన్ 2 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని గౌరవ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చిన వినతులను స్వయంగా పరిశీలించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫోన్ లో మాట్లాడి ఆదేశించారు.

**పోటెత్తిన అభిమాన సంద్రం :**

కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు జిల్లా నలమూరు నుంచి ప్రజలు రాకతో కార్యాలయం సందడి వాతావరణం సంతరించుకుంది. ప్రధానంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించమని పెద్ద ఎత్తున వినతులు అందాయి.నాలుగు మండలాల ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

**హాజరైన నాలుగు మండలాల అధికారులు :**

పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి నాలుగు మండలాల అధికారులు హాజరైయ్యారు. ఈ విధానం నిర్వహించడం వలన ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. వచ్చి వినతులు అక్కడే పరిష్కారం అయ్యేవిధంగా ఫలితాలు వస్తున్నాయని ప్రజలు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్, రెవెన్యూ, రహదారులు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : జిల్లా కలెక్టర్

- **గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో 7 వేల మందితో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమం**
- **పాల్గొన్న జిల్లా కలెక్టర్, స్థానిక శాసనసభ్యులు వెనిగండ్ల రాము, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అధికారులు, ప్రజలు..**
- **ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రకారం యోగాసనాలు వేయించిన యోగా శిక్షకులు**



**గుడివాడ, జూన్ 2 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ప్రతి రోజు యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చేసి పేర్కొన్నారు. యోగాంధ్ర – 2025 కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం గుడివాడలోని ఎన్టీఆర్ స్టేడియంలో లారీ, ఆటో డ్రైవర్ల అసోసియేషన్, బ్యాంకర్లు, సహకార సంస్థలు, యోగా ఔత్సాహికులు అనే ఇతివృత్తంతో 7 వేల మందితో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తోపాటు స్థానిక శాసనసభ్యులు వెనిగండ్ల రాము, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, తదితరులు పాల్గొని ప్రజలతో పాటు యోగాసనాలు వేశారు. ప్రజలు మైదానంలో ఆసనాలు వేసేందుకు వీలుగా పచ్చని తివాచీలను ఏర్పాటు చేశారు. స్టేడియం వేదిక నుండి యోగా శిక్షకులు పోతన శాస్త్రి ఆసనాలు వేసే విధానాన్ని చూపుతూ ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రకారం వారి చేత యోగాసనాలు వేయించి యోగ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేసి వారికి అల్పాహారం, రాగి జావా, తాగునీరు అందించారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం నాటికి రాష్ట్ర ప్రజలందరికీ యోగా ప్రాముఖ్యతను తెలియజెప్పి, యోగాను వారి జీవనశైలిలో భాగస్వామ్యం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని, ఆ రోజున విశాఖపట్నం బీచ్ ఒడ్డున రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల మందితో నిర్వహిస్తుందన్నారు. ఆ కార్యక్రమంలో భారత ప్రధానమంత్రి పాల్గొంటారని, అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు కోట్ల మంది యోగ కార్యక్రమంలో పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేస్తోందన్నారు. గత సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజు నుంచి మచిలీపట్నంలో యోగ సాధన చేయటం ప్రారంభించానని, నేటి వరకు దానిని క్రమం తప్పకుండా కొనసాగిస్తూ శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందించుకున్నానన్నారు. ప్రతిరోజు యోగా చేయడం ద్వారా తన శరీరంలో ఎన్నో మార్పులు వచ్చాయని, శరీర బరువు అదుపులో ఉండటంతో పాటు నాణ్యమైన నిద్ర, చురుకుదనం, వృత్తిపరంగా నిర్ణయాలు వేగంగా తీసుకోవడం, ఒత్తిడిని జయించడం వంటివి యోగాతోనే సాధ్యమైందని కలెక్టర్ తన వ్యక్తిగత అనుభవాన్ని ఈ సందర్భంగా పంచుకున్నారు. యోగా ద్వారా హెల్త్ కోసం చేసే ఖర్చులు కూడా గణనీయంగా తగ్గుతాయని ఆయన చెబుతూ ప్రజలందరూ యోగాను బరువుగా భావించకుండా 21 రోజులపాటు క్రమం తప్పకుండా సాధనం చేయడం ద్వారా జీవనశైలిలో భాగమైపోతుందన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో శిక్షణ పొందిన యోగా శిక్షకులను ఏర్పాటు చేశామని, ప్రజలు దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవయవాలు ఉన్నంత వరకు ఆసనాలు వేద్దాం.. ప్రాణం ఉన్నంత వరకు ప్రాణాయామం చేద్దాం.. అని జిల్లా కలెక్టర్ అందరి చేత నినాదం చేయించారు. గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము మాట్లాడుతూ భారతదేశంలో పుట్టిన అత్యంత పురాతనమైన యోగ మన పూర్వీకులు మనకు ఇచ్చిన గొప్ప వరం అని, ప్రతిరోజు కొద్దిపాటి సమయాన్ని కేటాయించి యోగాను మన జీవన శైలిలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ యోగాను ప్రపంచానికి పరిచయం చేసి గొప్ప మేలు చేశారన్నారు. యోగాకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలనే ఉద్దేశంతో భారత ప్రధానమంత్రి 2014 జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవంను ప్రారంభించడం జరిగిందన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో ప్రతిరోజు జరుగుతున్న యోగా శిక్షణ తరగతులపై విస్తృత ప్రచారం కల్పించాలని స్టేడియం కమిటీ సభ్యులకు ఆయన సూచించారు. తాను కూడా ఇక నుండి వారంలో మూడు రోజులు తప్పనిసరిగా యోగా తరగతులకు హాజరయ్యే విధంగా ప్రణాళిక చేసుకుంటానని, ప్రజలందరూ కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చివరిగా, ఇటీవల ఢిల్లీలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి నృత్య ప్రదర్శన ఇచ్చిన గుడివాడలోని ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన చిన్నారి గోపుశెట్టి సిరి వేదికపై పలు యోగాసనాలు వేసి ప్రజలను అబ్బురపరిచారు. అనంతరం యోగా శిక్షకులు, చిన్నారిని జిల్లా కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్ శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కే ఆర్ ఆర్ సీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవీ ఎన్టీఆర్ స్టేడియం కమిటి వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, గుడివాడ ఆర్డీఓ జీ బాలసుబ్రమణ్యం, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, లారీ, ఆటో డ్రైవర్లు, బ్యాంకర్లు, సహకార సంస్థల సిబ్బంది, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.